ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 20.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 270 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

పాండ్యా.. తిలక్ పరుగుల సునామీ 8

సమస్యల పరిష్కారమే 'ప్రజావాణి' లక్ష్యం

దేశంలో ఇలాంటి కార్యక్రమం ఎక్కడా లేదు

- రెండేళ్లలో 74 శాతం సమస్యల పరిష్కారం
- లక్ష్యం నెరవేరినందుకు సంతోషంగా ఉంది
- పదేళ్లు ప్రజల కోసం ప్రజాభవన్ గేట్లు తెరవలేదు
- వారూ ప్రజావాణిని విమర్శిస్తున్నారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ప్రజావాణి రెండవ వార్షికోత్సవ సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 19: ప్రజల సమస్యలు పరిష్కారమే 'ప్రజావాణి' లక్ష్యం అని, సీఎం రేవంత్ రెడ్డితో పాటు కేబినెట్ సహచరులు అంతా కలిసి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం ప్రజావాణి అని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్రజల సమస్యలు విని పరిష్కారం చేయడానికి ప్రతి మంగళ, శుక్రవారాలు క్రమం తప్పకుండా దరఖాస్తులు తీసుకొని 74% సమస్యలు పరిష్కారం చేయడం గొప్ప విజయమని డిప్యూటీ సీఎం అన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన సీఎం ప్రజావాణి రెండవ వార్షికోత్సవ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ సీఎం ప్రజావాణి వంటి కార్యక్రమం భారతదేశంలో ఎక్కడా అమలు జరగడం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రజావాణి పెట్టడమే కాదు వచ్చిన దరఖాస్తులను నిబద్ధతతో పరిష్కరించేందుకు ఉద్యోగ బృందం ప్రయత్నం చేయకపోతే 74% విజయం

...:: మిగతా 2లో

భారత వృద్ధిలో పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పారదర్శక ఉద్యోగ భర్తీ విధానాల ద్వారా పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు దేశంలోనే అత్యంత నమ్మకమైన సంస్థలుగా నిలుస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము కొనియాడారు. నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. అభ్యర్థుల నిజాయతీ, సమగ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జెండర్‌సెన్సిటివిటీకి పబ్లిక్ సర్వీస్‌కమిషన్లు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషన్ చైర్మన్లకు స్పష్టం చేశారు.

నియామకాల్లో పారదర్శకత ముఖ్యం

ఎంపికలో సవాళ్లకు తక్షణ పరిష్కారం అవసరం

- జెండర్‌సెన్సిటివిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి
- లక్ష్య సాధన దిశగా పీఎస్సీలు పనిచేయాలి
- ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి
- దేశ వృద్ధిలో పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లది కీలక పాత్ర
- కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము
- టీజీపీఎస్సీ పరీక్షలను దిగ్విజయంగా నిర్వహించింది
- సెంటర్‌ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర గవర్నర్‌జిష్ణుదేవ్ వర్మ వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్19: నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషన్ చైర్మన్లకు స్పష్టం చేశారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని, కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

...:: మిగతా 2లో

ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

వీబీ-జీ రామ్ జీ బిల్లు విషయమై విపక్షాలు నిరసన వ్యక్తం చేయడంతో ఉభయ సభలు ప్రారంభమైన కాసేపటికే వాయిదా పడ్డాయి. ఆ తర్వాత శీతాకాల సమావేశాలను ముగిస్తున్నట్టు లోక్‌సభ, రాజ్యసభ సభాధిపతులు ప్రకటించారు.

7

గ్రీన్ కార్డు లాటరీ తాత్కాలికంగా నిలిపివేత

బ్రౌన్ యూనివర్సిటీ కాల్పుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం గ్రీన్ కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీని ప్రభావం భారతీయులపై తీవ్రంగా పడింది.

7

41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రగుల్ల రవి
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డివిజన్ కమిటీ
- సీఎం రేవంత్‌పిలుపు మేరకు జనజీవన స్రవంతిలోకి
- మావోయిస్టుల వద్ద 24 తుపాకులు స్వాధీనం
- ఇప్పటి వరకు 509 మంది లొంగిపోయారు
- అజ్ఞాతంలో ఇంకా 54 మంది తెలంగాణ వారు
- మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్19: తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అందులో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రగుల్ల రవి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు ఉన్నారు. మావోయిస్టుల నుంచి పోలీసులు 24 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ దళాల్లో పనిచేస్తున్న మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు తెలంగాణకు చెందిన కామారెడ్డి జిల్లా వాసి ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్, మంచిర్యాలకు చెందిన కనికారపు ప్రభంజన్ ఉన్నట్లు తెలిపారు. మిగతా వాళ్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారని తెలిపారు. కుమురం భీమ్ డివిజన్ కమిటీ కార్యదర్శి,

...:: మిగతా 2లో

బంగ్లాదేశ్‌లో మళ్లీ విధ్వంసం

- తిరుగుబాటు నాయకుడు హాది మృతితో కలకలం
- దేశంలోని పలు చోట్ల అల్లర్లు
- జాగ్రత్తగా ఉండాలని స్థానిక భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ

...:: 7లో

మంచు.. కాలుష్యం.. ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

ఉత్తరాదిని ఓ వైపు దట్టమైన పొగమంచుకు తోడు వాయు కాలుష్యం అదుపు తప్పటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాహనాలతోపాటు కాలి నడకన కూడా రోడ్లపైకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

7

దమ్ముంటే ఆ 10 మందితో రాజీనామా చేయించు

- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఅర్ సవాల్
- పదవుల కోసం ఇంత దిగజారుతారా?
- స్పీకర్ ఎదుట పచ్చి అబద్ధాలాడుతారా?
- అమ్ముడుపోయిన ఎమ్మెల్యేల బతుకులు ఆగం
- సిరిసిల్లలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్/సిరిసిల్ల

డిసెంబర్ 19: పంచాయితీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నరని చెప్పుకుంటున్న, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే, నైతికత ఉంటే బీఆర్ఎస్ నుంచి అక్రమంగా చేర్చుకున్న 10 మంది ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సవాల్ విసిరారు. అప్పుడు ప్రజలు ఏవైపు ఉన్నారో నిర్ణయిస్తారని, దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలని కేటీఅర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చడంలో సిద్ధహస్తుడని కేటీఆర్ విమర్శించారు. "నిన్న హైదరాబాద్ ప్రెస్ మీట్ లో రేవంత్ రెడ్డి మొదట కాంగ్రెస్ 66 శాతం గెలిచిందని, ఇది ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదమని గొప్పలు చెప్పారు. కానీ, సరిగ్గా ఐదు నిమిషాలకే మాట మార్చి.. ఇవి స్థానిక అంశాలపై జరిగిన ఎన్నికలని, ప్రభుత్వానికి సంబంధం లేదని తప్పించుకున్నారు. ముఖ్యమంత్రి గారూ.. మీకు నిజంగానే 66 శాతం ప్రజాధరణ ఉంటే, నా సవాల్ స్వీకరించండి. మా పార్టీ నుంచి మీరు సంతలో పశువుల్లా ఎత్తుకెళ్లిన ఆ పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి. అప్పుడు ప్రజలే చెప్తారు ఎవరి శాతం ఎంతో.. ఎవరి బతుకెంతో.. ఎవరి సత్తా ఎంతో ప్రజాక్షేత్రంలోనే తేలిపోతుంది" అని కేటీఆర్ అన్నారు.

పదవుల కోసం ఇంత దిగజారుతారా?

ఫిరాయింపు ఎమ్మెల్యేల తీరుపై కేటీఆర్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మంత్రులుగా, స్పీకర్‌లుగా పని చేసిన కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి వారు కేవలం 'గడ్డిపోచ' లాంటి పదవుల కోసం ఇంతలా దిగజారి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. "బయట కాంగ్రెస్‌లో చేరామని మైకుల్లో ప్రగల్భాలు పలికి, రాహుల్ గాంధీ కండువా కప్పారని చెప్పుకున్న ఈ పెద్ద మనుషులు.. ఇప్పుడు స్పీకర్ విచారణలో మాత్రం

...:: మిగతా 2లో

గిరిజనులు, ఆదివాసీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

- వారి భూములు దోచుకుని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫైర్
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటన

ప్రతిపక్షం ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

డిసెంబర్ 19: గిరిజనులు, ఆదివాసీలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా మండిపడ్డారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా కవిత పర్యటించారు. గిరిజనుల భూములు, హక్కులు కాలరాసి కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. మణుగూరులోని పీకే ఓసీ-2 గనిని సందర్శించిన అనంతరం కవిత మాట్లాడుతూ, ఈ గనిని ప్రైవేటుపరం చేయాలనే కుట్రతో మణుగూరు ప్రజల మనుగడనే ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని హెచ్చరించారు. ఓసీ-2 మైన్ మీదే మణుగూరు ప్రాంత ప్రజల జీవనం ఆధారపడి ఉందని, సింగరేణి సీఎండీ స్వయంగా మూడు సంవత్సరాల్లో మైన్ మూసేస్తామని చెప్పడం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. మైన్ ప్రైవేటుపరమైతే మణుగూరుకు భవిష్యత్తే ఉండదని స్పష్టం చేస్తూ, ఈ నిర్ణయాన్ని జాగృతి తరఫున ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని తెలిపారు. సింగరేణి గని విస్తరణ పేరుతో 2016లో మణుగూరు సమీపంలోని గొత్తికోయ గూడెంలో భూసేకరణ చేపట్టి, పూర్తిగా భూములు తీసుకుని కేవలం లక్షా అరవై వేల రూపాయల ప్యాకేజీ మాత్రమే ఇచ్చి, 72 గిరిజన కుటుంబాలను రోడ్డున పడేశారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. అడవిపై ఆధారపడి జీవించే గిరిజనులను

...:: మిగతా 2లో

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్‌లో సెక్యూర్టీ సిబ్బంది, నక్సలైట్ల మధ్య శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. బైరాంఘర్-ఇంద్రావతి అడవి కొండల్లో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

7

రాష్ట్రీయం

దేశ నిర్మాణంలో ఎగ్జిబిషన్ సొసైటీ పాత్ర కీలకం

- వనిత ఫార్మసీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: ఆరు దశాబ్దాలుగా 20 విద్యా సంస్థల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ దేశ నిర్మాణంలో ఎగ్జిబిషన్ సొసైటీ కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. యూజీసీ స్వయం ప్రతిపత్తి, ఎన్‌బీఏ గుర్తింపు, నాక్ ఏ+ గ్రేడ్ సాధించిన ఈ సంస్థ తెలంగాణలో ఫార్మాస్యూటికల్ రంగానికి కేంద్రబిందువుగా నిలిచిందని మంత్రి అన్నారు. శుక్రవారం తర్నాకలోని సరోజిని నాయుడు వనిత ఫార్మసీ మహా విద్యాలయంలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నేడు ప్రపంచంలోనే బల్క్ డ్రగ్స్ ఉత్పత్తికి ప్రధాన కేంద్రంగా ఎదిగిందని, ఫార్మసీ విద్యార్థులకు విస్తృత ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 2025 పట్టభద్రులైన విద్యార్థులు తెలంగాణ ఫార్మా రంగ భవిష్యత్తుకు దిశానిర్దేశకులవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, వారి విజయ ప్రయాణంలో తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణంగా తోడుంటుందని భరోసా ఇచ్చారు.

నియామకాల్లో పారదర్శకత ముఖ్యం

మొదటిపేజీ తరువాయి

సూచించారు. పబ్లిక్‌సర్వీస్‌కమిషన్‌ఛైర్‌పర్సన్ల సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. నియామకాల విషయంలో సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయన్నారు. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైందని చెప్పారు. పబ్లిక్‌సర్వీస్ కమిషన్ల విషయంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని వివరించారు. లక్ష్యాలు సాధించే దిశగా పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు ఉండాలని సూచించారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. భారత వృద్ధిలో పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పారదర్శక ఉద్యోగ భర్తీ విధానాల ద్వారా పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు దేశంలోనే అత్యంత నమ్మకమైన సంస్థలుగా నిలుస్తున్నాయని కొనియాడారు. అభ్యర్థుల నిజాయితీ, సమగ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జెండర్‌సెన్సిటివిటీకి పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని భారత్‌కృషి చేస్తోందని, అలాగే వికసిత భారత్ 2047 సాధన కోసం కృషి చేస్తోందన్నారు. ప్రస్తుత సమయంలో భారత్‌కు అత్యుత్తమ పబ్లిక్ సర్వెంట్లు అవసరం ఉందని చెప్పారు. అలాంటి వారిని నియమించటంలో పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు ఈ సదస్సు ద్వారా మరింత మెరుగైన విధానాలను అందిపుచ్చుకుంటాయని భావిస్తున్నానని అన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షలను సక్రమంగా నిర్వహించింది: గవర్నర్

26వ నేషనల్‌కాన్ఫరెన్స్‌ను తెలంగాణ పబ్లిక్‌సర్వీస్‌కమిషన్ ద్వారా నిర్వహించటం గర్వంగా ఉందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. గతేడాది అన్ని రకాల పరీక్షలను తెలంగాణ పబ్లిక్‌సర్వీస్‌కమిషన్‌దిగ్విజయంగా నిర్వహించిందని కొనియాడారు. సేవా దృక్పథం కలవారిని ప్రతిభ ఆధారంగా, క్యాలెండర్‌అనుగుణంగా నియామకాలు చేపట్టాలని సూచించారు. సమయానికి నోటిఫికేషన్లు ఇవ్వటం, పరీక్షల నిర్వహణ, ఫలితాలు ఇవ్వటం ద్వారా పీఎస్సీల పట్ల ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్‌కుమార్‌భాదూరియా, ముఖ్యంగా రాష్ట్రపతి ముర్ముకు యూపీఎస్సీ ఛైర్మన్ హైదరాబాదికళాకారులు రూపొందించిసిల్వర్‌ఫిలిగ్రీని అందజేశారు.

పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లు బలోపేతమే లక్ష్యం

రాజ్యాంగం, పరిపాలన విభాగంలో ఈ సదస్సు కీలక పాత్ర పోషిస్తుందని యూపీఎస్సీ ఛైర్మన్‌డా.అజయ్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రాల పబ్లిక్‌సర్వీస్‌కమిషన్లను మరింత బలోపేతం చేయటమే ప్రధాన లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పట్ల నమ్మకాన్ని పెంపొందించటం మనందరి బాధ్యత అని సూచించారు. యూపీఎస్సీ ద్వారా ఒక సెంటర్‌ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. సెంటర్‌ఆఫ్‌ఎక్సలెన్స్‌ద్వారా రాష్ట్రాల పబ్లిక్‌సర్వీస్ కమిషన్ల సామర్థ్యం పెంపు, నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. లీగల్‌గా సమస్యలు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేపట్టేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు

- మాక్ ఎక్సర్సైజ్ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 19: ప్రకృతి విపత్తులు, వరదలు, పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించిన సమయాలలో తక్షణం స్పందించే విషయంలో వివిధ శాఖలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. విపత్తులను సమర్ధవంతం ఎదుర్కొందుకు చేపట్టాల్సిన చర్యలపై ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టంకు అనుగుణంగా జాతీయ విపత్తుల నివారణ సంస్థ (ఎన్డీఎంఏ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్సైజ్ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి శుక్రవారం బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగిన రాష్ట్రస్థాయి ఉన్నత స్థాయి సమావేశానికి సీఎస్ హాజరయ్యారు. ఎన్డీఎంఏ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహల్, విపత్తుల నిర్వహణ శాఖ డీజీ విక్రమ్ జిత్ సింగ్ మాన్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెవిన్యూ తదితర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల క్లౌడ్ బరస్ట్ తో అతి తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం కురవడం, వరదలు, పరిశ్రమలలో ప్రమాదాలను ఎదుర్కోవడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసేందుకు ఈ విధమైన మాక్ డ్రిల్స్ దోహదపడుతాయని అన్నారు. విపత్తు సమయంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్ధవంతంగా వినియోగించుకొని ఆయా శాఖల మధ్య సమన్వయంతో బాధిత ప్రజలకు భరోసా కలిగించడం తోపాటు సమర్ధవంతంగా సమాచార పంపిణీ తదితర అంశాలపై మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించడం అధికారులకు విపత్తుల సమయంలో పనిచేయడానికి తోడ్పాటునిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఎంఏ సభ్యులు సయ్యద్ అస్మత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ మాక్ డ్రిల్ ద్వారా ఆలోచనలు గత అనుభవాలు, ఉత్తమ పద్ధతులు, ప్రతి శాఖ ద్వారా చేపట్టవలసిన పనులు లైవ్ ఎక్సర్సైజ్ ద్వారా మరింత అవగాహన కలుగుతుందని అన్నారు. ఎన్డీఎంఏ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహల్ వివిధ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్రస్థాయి అధికారులతో మాక్ డ్రిల్ సన్నద్ధతపై సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలోని 11 వరద ప్రభావిత జిల్లాలు, పారిశ్రామిక ప్రమాదాలు సంబంధించి ఐదు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు.

గిరిజనులు, ఆదివాసీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

కనీస పునరావాసం లేకుండా నిర్వాసితులుగా మార్చడం అమానవీయ చర్య అని విమర్శించారు. దాదాపు ఎనిమిదేళ్లుగా వారు అక్కడే జీవనం సాగిస్తున్నప్పటికీ, తాగునీరు, రోడ్డు, కరెంట్, స్కూల్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకుండా దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. గిరిజన బిడ్డలకు నీళ్లు కూడా ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం హింసకు గురిచేస్తోందని ఆరోపించారు.

గిరిజనులకు తక్షణమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

గిరిజనులకు తక్షణమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఈ సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. గిరిజనుల అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. గిరిజన కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారని, గత 30 ఏళ్లుగా ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా చేపట్టలేదని విమర్శించారు. గిరిజనుల కోసం ప్రత్యేక బీఈడీ కాలేజీ ఉన్నప్పటికీ, ఒక్క ట్రైబల్ డీఎస్సీ కూడా వేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. భద్రాచలం సమీపంలోని ముంపుతో సంబంధం లేని ఐదు గ్రామాలను ఏపీలో విలీనం చేయడం తీవ్ర అన్యాయమని కవిత అన్నారు. ఆ గ్రామాల ప్రజలు తమ అవసరాలన్నింటికీ భద్రాచలంపైనే ఆధారపడుతున్నప్పటికీ, వారికి తెలంగాణ ప్రభుత్వ పథకాలు కూడా అందని పరిస్థితి ఉందని తెలిపారు. ఈ అంశంపై బీజేపీ నేతలు, చంద్రబాబు నాయుడు సహకరించాలని కోరారు. సీతారామ ఎత్తిపోతల పథకం, పెద్దవాగు ప్రాజెక్టు వంటి సాగునీటి ప్రాజెక్టులు వేల కోట్ల రూపాయలతో నిర్మించినప్పటికీ, కొత్తగూడెం జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాని పరిస్థితి ఉందని కవిత విమర్శించారు. ఆయిల్ పామ్ రైతులు, పెద్దవాగు ప్రాజెక్టుతో నష్టపోయిన రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల జీతాలు, ఉద్యోగ భద్రత, డిపెండెంట్ ఉద్యోగాలు వంటి అంశాలపై కార్మికుల పక్షాన హెచ్ఎంఎస్‌తో కలిసి జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని కవిత స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారమే 'ప్రజావాణి' లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

సాధ్యం కాదని తెలిపారు. ఇంకా పరిష్కారం కానీ అంశాలను పరిష్కరించే అవకాశం ఉందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. ఏ సంకల్పంతో ప్రజావాణిని ప్రారంభించామో ఆ లక్ష్యం నెరవేర్చుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని, ఈ కార్యక్రమం క్రమంతప్పకుండా కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక సాఫ్ట్ వేర్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన వారు, ప్రజల కోసం కనీసం ప్రజాభవన్ గేట్లు తెరవని వారు కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని మాట్లాడటం.. దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉందని డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణిలో విజయ గాథలు వింటుంటే సిబ్బంది ఎంత చిత్తశుద్ధితో పనిచేశారో వివరించి అభినందించేందుకే తాను ఈ సమావేశానికి వచ్చానని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని సంస్థలు, వ్యవస్థలు ప్రజల కోసం ఉపయోగపడాలి అనేదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

ప్రజల సమస్యల పరిష్కార వేదిక..

మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణా రావు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కార వేదిక సీఎం ప్రజావాణి అని పేర్కొన్నారు. ఇందిరమ్మ పాలనలో ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని వారు అన్నారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో సీఎం ప్రజావాణిలో 1,07, 829 దరఖాస్తులు అందగా అందులో 64,623 దరఖాస్తులు పరిష్కారం అయ్యాయని, మిగతా 48,064 దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయని, సమస్యల పరిష్కారం 74% శాతం ఉందని తెలిపారు. సిబ్బంది, అధికారులు ఎంతో ఓపికతో ప్రజల సమస్యలు వింటూ పరిష్కారం చూపుతున్నారని చిన్నారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీమ్ రెడ్డి, హౌసింగ్ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్, సీజీజీ ఛైర్మన్ రవి గుప్తా, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరి చందన, తదితరులు పాల్గొన్నారు. సీఎం ప్రజావాణి ద్వారా లబ్ది పొందిన వివిధ వర్గాల ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మాట్లాడారు. పదేళ్ల క్రితం ఆర్టీసీలో సర్వీస్ నుంచి డిస్మిస్ అయిన 242 మంది డ్రైవర్స్, కండక్టర్స్ కు ప్రజావాణి ద్వారా తిరిగి ఉద్యోగాలు రావడం, కోర్టు కేసుల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న 1,750 మందికి ప్రజావాణి ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అలాట్ కావడం, ఆరోగ్య సమస్యలు పరిష్కారం కావడం, గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం వంటి అనేక విజయ గాథలు ఈ కార్యక్రమంలో లబ్దిదారులు తెలిపారు.

దమ్ముంటే ఆ 10 మందితో రాజీనామా చేయించు

మొదటిపేజీ తరువాయి

తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. పదవుల కోసం సూరు పట్టుకొని గబ్బిలాల్లా వేలాడుతున్న వీరి బతుకులు పూర్తిగా ఆగమైపోయాయి" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఒత్తిడితో స్పీకర్ కూడా ఆధారాలను పక్కన పెట్టి అబద్ధాలు చెప్పాల్సిన దుస్థితికి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ కూడా తాము ఇచ్చిన ఆధారాలు పక్కన పెట్టి ముఖ్యమంత్రి చెప్పినట్టు అబద్ధాలు ఆడక తప్పని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్పారు

రైతులను, మహిళలను, బీసీలను మోసం చేసినందుకే ఈ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికార యంత్రాంగాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం గులాబీ జెండా వైపే నిలిచారని స్పష్టం చేశారు. "సిరిసిల్లలో 117 పంచాయతీలకు గాను 80 చోట్ల బీఆర్ఎస్ గెలవడమే దీనికి నిదర్శనం. ముఖ్యమంత్రి, మంత్రులు జిల్లాలు తిరిగినా, బెదిరించినా ప్రజలు మాత్రం కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు. పల్లెలు బాగుపడాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కేసీఆర్ నాయకత్వమే శరణ్యమని ప్రజలు మరోసారి తేల్చి చెప్పారు" అని కేటీఆర్ అన్నారు.

కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదు

బెదిరింపులకు, ఫోన్ కాల్స్‌కు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ భరోసా ఇచ్చారు. "గెలిచిన వారు, ఓడిపోయిన వారు కలిసి పనిచేయాలి. వచ్చే సంవత్సరంలో కొత్తగా సభ్యత్వ నమోదు, గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేసుకుంటాం. పాత తరం అనుభవం, కొత్త రక్తం కలిసేలా చాకుల్లాంటి పిల్లలతో కమిటీలు వేసి పార్టీని మరింత బలోపేతం చేస్తాం" అని ప్రకటించారు. రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో కూడా ఇదే ప్రభంజనం కొనసాగిస్తామని ఆయన పిలుపునిచ్చారు.

మల్కాపూర్ పెద్ద చెరువు ఆధునీకరణకు చర్యలు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో హైదరాబాద్ /సంగారెడ్డి, డిసెంబర్ 19: సంగారెడ్డి నియోజకవర్గంలోని మల్కాపూర్ పెద్ద చెరువు ఆధునీకరణకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మల్కాపూర్ పెద్ద చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్, కాలువలు, ఆయకట్టు కాలువలు, చెరువు కట్ట బలోపేతం పనులను ఆధునీకరించాలని ఎమ్మెల్యే జగ్గారెడ్డి మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. మేకవనంపల్లి కత్వా నుండి మల్కాపూర్ పెద్ద చెరువుకు వచ్చే 15 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్ అభివృద్ధి, పెద్ద చెరువు నుండి కలబ్ గూర్ గ్రామ పరిధిలోని నాగుల కుంట, మొగుళ్ళ కుంట, గొల్ల కుంట, పులువాని కుంటల వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర నీరు వెళ్లే కాలువల ఆధునీకరణ, అలాగే పెద్ద చెరువు నుండి ఆయకట్టుకు వెళ్లే 4 కిలోమీటర్ల పంట కాలువల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో విస్తీర్ణంలోనే అతి పెద్దదైన మల్కాపూర్ పెద్ద చెరువు సుమారు 2600 ఎకరాల ఆయకట్టును కలిగి ఉంది. దశాబ్దానికి పైగా మరమ్మత్తులకు నోచుకోని ఈ చెరువు నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు. నియోజకవర్గంలోని ఆరు చెరువులకు ఈ పెద్ద చెరువే ఆధారం కావడంతో దీని ఆధునీకరణ ద్వారా దిగువ చెరువులు పూర్తిగా నిండే అవకాశం ఉండటంతో పాటు ఆయకట్టు విస్తీర్ణం కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు. మల్కాపూర్ పెద్ద చెరువు నీటితో నిండుగా ఉంటే సంగారెడ్డి పట్టణంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండే అవకాశం ఉంటుందని, సుందరీకరణ పనులు పూర్తయితే ఈ ప్రాంతం పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందుతుందని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

41 మంది మావోయిస్టుల లొంగుబాటు

మొదటిపేజీ తరువాయి

ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 509 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు.

కీలక నేతల ఆదేశాలతోనే లొంగుబాటు

మావోయిస్టులు లొంగిపోవడానికి ప్రధాన కారణం 2026 మార్చి 31 వరకు కొత్త ప్రాంతాలకు వెళ్లాలని మావోయిస్టు పార్టీ నుంచి ఆదేశాలు వచ్చాయని డీజీపీ తెలిపారు. తెలియని ప్రాంతాలకు వెళ్లడం, నిత్యావసర వస్తువులు సరైన సమయంలో అందకపోవడం, కీలక నాయకులే లొంగిపోతున్న నేపథ్యంలో కిందిస్థాయి మావోయిస్టులు లొంగిపోయేందుకు ముందుకు వచ్చారన్నారు. తెలంగాణ పోలీసుల సమక్షంలో 41 మంది సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన అజ్ఞాత కేడర్లు 24 ఆయుధాలతో లొంగిపోయారని డీజీపీ తెలిపారు. తీసుకొచ్చిన ఆయుధాల్లో ఒకటి ఎల్ఎంజీ, 3 ఏకే 47 రైఫిల్స్, 5 ఎస్ఎల్ఆర్ రేఫిల్స్, 7 ఇన్సాస్ రైఫిల్స్, 1 బీజేఎల్ గ్రానైడ్ లాంఛర్, నాలుగు 303 రైఫిల్స్, ఒకటి సింగిల్ షాట్ రైఫిల్స్, 2 ఎయిర్ గన్స్‌తో కలుపుకుని మొత్తం 24 ఆయుధాలతో లొంగిపోయారు. అక్టోబర్ 21న జరిగిన పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినటువంటి పిలుపు మేరకు వీళ్లు ప్రభుత్వం ముందు లొంగిపోయారని శివధర్ రెడ్డి తెలిపారు.

కేంద్రం కూడా సాయం చేస్తుంది

లొంగిపోయిన వారికి ప్రభుత్వం కేడర్ ప్రకారం నగదు పరిహారం అందిస్తుందని, ఆయుధాలతో లొంగిపోయే వారికి కేంద్ర ప్రభుత్వం కూడా సహాయం చేస్తుందని డీజీపీ తెలిపారు. లొంగిపోయిన 41 మంది మావోయిస్టులపై రూ. 1.46 కోట్ల రివార్డు ఉందన్న ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వారికి రావాల్సిన పరిహారాన్ని అందిస్తామన్నారు. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలను అందించినట్లు తెలిపారు. ఏ రాష్ట్రాలకు చెందిన వారిని ఆ రాష్ట్ర ప్రభుత్వాలకి అప్పగిస్తామని అన్నారు.

అజ్ఞాతంలో ఇంకా 54 మంది

ప్రస్తుతం మావోయిస్టుల్లో మొత్తం 54 మంది మాత్రమే తెలంగాణ వాళ్లు ఉన్నారని, వీరిలో ఆరుగురు మాత్రమే తెలంగాణలో పనిచేస్తున్నారని శివధర్ రెడ్డి అన్నారు. ఇందులో 5 మంది సెంట్రల్ కమిటీలో ఉన్నారని, 8 మంది స్టేట్ కమిటీలో ఉన్నారన్నారు. అలాగే 13 మంది డివిజన్ కమిటీ , 12 మంది కిందిస్థాయిలో సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు. వీరిలో 48 మంది వేరే రాష్ట్రాల్లో పని చేస్తున్నారని, ఏడుగురు మాత్రమే తెలంగాణలో ఉన్నట్లు గుర్తించినట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు అప్పగించిన ఆయుధాలు దాదాపు అన్ని పోలీసుల నుంచి కొల్లగొట్టినవేనన్నారు, ఆర్మీ, పోలీసులు వద్ద ఉండే ఆయుధాలే వారి వద్ద ఉన్నాయని, దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీసులకు ఆయుధాల సీరియల్ నెంబర్‌లపై సమాచారం ఇస్తామన్నారు. వారికి గతంలో మిస్సైన ఆయుధాలను అప్పగించనున్నట్లు తెలిపారు.

సాజిద్‌కు హైదరాబాద్‌తో సంబంధం లేదు

- డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: ఆస్ట్రేలియా బాండీ బీచ్‌లో కాల్పులకు తెగబడి పోలీసుల చేతుల్లో హతమైన ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా ఉగ్రవాది సాజిద్ అక్రమ్ కు హైదరాబాద్ తో సంబంధం లేదని డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. కాల్పులు జరిపిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడేనని, సాజిద్ అక్రమ్ 27 సంవత్సరాల కాలంలో ఆరుసార్లు మాత్రమే భారతదేశానికి వచ్చాడని వెల్లడించారు. 1998లో అక్రమ్ ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లాడని, ఆ తర్వాత అదే సంవత్సరం యురోపియన్ కు చెందిన యువతి వెనెరా గ్రోసోని వివాహం చేసుకున్నాడని తెలిపారు. అయితే ఈ ఉగ్రదాడికి హైదరాబాద్‌కు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. పెళ్లి అనంతరం మొదటి సారి 1998లో భార్యతో పాటు హైదరాబాద్ వచ్చాడని తెలిపారు. 2004లో ఓసారి, 2009 ఫిబ్రవరిలో మరోసారి నగరానికి వచ్చాడని డీజీపీ వెల్లడించారు. 2011 జూబ్లీ ప్రాపర్టీ సెటిల్మెంట్ ఇంకోసారి వచ్చాడని, 2016 మరోసారి ప్రాపర్టీ సెటిల్మెంట్ కోసం ఇక్కడికి వచ్చాడని చెప్పుకొచ్చారు. 2022 తల్లి, సోదరిని చూడటం కోసం నగరానికి డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. కాగా, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియాతో సంబంధం ఉన్న తండ్రీకొడుకులు సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్.. యూదులంతా బాండీ బీచ్‌లో హనుక్కా పండుగ చేసుకుంటుండగా కాల్పులకు తెగబడ్డారు.ఈ కాల్పుల్లో 16 మంది మృతిచెందగా.. 36 మంది గాయపడ్డారు. పోలీసుల కాల్పుల్లో సాజిద్ అక్రమ్ అక్కడికక్కడే మృతిచెందగా.. అతని కుమారుడు నవీద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు నవీద్‌పై న్యూ సౌత్‌వేల్స్ పరిధిలోని బాండీ బీచ్ పోలీసులు మొత్తం 59 నేరాలకు పాల్పడినట్టు అభియోగాలు నమోదు చేశారు. వాటిలో 15 హత్యలు, ఓ ఉగ్రవాద చర్యకు సంబంధించిన కేసులు ఉన్నాయి.

పీఏసీఎస్, డీసీసీబీల రద్దు

- రైతులకు శుభవార్త చెప్పిన సర్కారు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఛైర్మన్లు, డైరెక్టర్ల పాలకవర్గాలను రద్దు చేసింది. ఆగష్టు 14వ తేదీనే వీరి పదవీకాలం ముగిసినట్లు పేర్కొంది. వీరితో పాటు తొమ్మిది జిల్లాల డీసీసీబీలను కూడా తొలగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సహకార సొసైటీల నిర్వహణకు ఎన్నికల ద్వారా పాలకవర్గాలను నియమిస్తుంది. ఎన్నికైన పాలకవర్గాలు ప్రభుత్వం ద్వారా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అమలయ్యే పథకాలను అందిస్తాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల ద్వారా పాలకవర్గాలను ప్రభుత్వం నియమిస్తుంది. గత కేసీఆర్ ప్రభుత్వంలో 2020 ఫిబ్రవరి 13న వీటికి ఎన్నికలు జరిగాయి. వీటి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. ఫిబ్రవరితో ముగిసిన పదవీ కాలాన్ని 6 నెలలపాటు పొడిగించింది. పొడిగించిన పదవీకాలం కూడా ముగియడంతో తాజాగా పాలకవర్గాలను రద్దు చేసింది. పీఏసీఎస్ పాలక వర్గాలు కొన్ని, డీసీసీబీ పాలక వర్గంలో ఉన్న కొంత మంది అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఇటీవల సీఎం మీడియా సమావేశంలో కొంతమంది సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా డీసీసీబీలలో కొంతమంది అధికారులను వేధించడం, పదోన్నతులు వచ్చినా, వాటిని రద్దు చేసి వారికి కావాలసిన వారిని నియమించడం తదితర విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం ఆదేశాలతో పాలకవర్గాల పదవీకాలన్ని రద్దు చేశారు.

బంగ్లాదేశ్‌లో భారత డిప్యూటీ హై కమిషనర్ ఇంటిపై ప్లాన్ ప్రకారమే దాడి చేశారు. ఎన్నికలు వాయిదా వేయాలనే ఉద్దేశంతో మధ్యంతర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న యూనస్ దేశంలో హింసను ప్రేరేపిస్తున్నారు. కింది స్థాయి పొలిటికల్ వర్కర్లను తొక్కేయాలని చూస్తున్నారన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనే ఉద్దేశం కూడా దాడుల వెనుక ఉంది.

- బంగ్లాదేశ్ మాజీ మొహిబుల్ హసన్ చౌదరి

ప్రజల్లోకి వెళ్లని ప్రభుత్వ పథకాలు

- సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఆ బాధ్యత ప్రజా సంబంధాల అధికారులదే
- మారుతున్న కాలానికి అనుగుణంగా పనితీరు మారాలి
- ప్రజా సంబంధాల అధికారుల వర్క్‌షాపులో మంత్రి పొంగులేటి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 19: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి వెళ్లడం లేదని, ఇందు కోసం ప్రజా సంబంధాల శాఖ పనితీరుపై రాష్ట్ర సమాచార, పౌసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని మీడియా అకాడమీలో జిల్లా ప్రజా సంబంధాల అధికారులతో నిర్వహించిన పునశ్చరణ తరగతులకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం, రెండేళ్ల పాలనలోనే తెలంగాణకు స్పష్టమైన కొత్త దిశను చూపించిందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఏ మార్పు కోరుకొని కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచారో, ఆ మార్పును కేవలం రెండేళ్లలోనే ప్రజల కళ్ల ముందే నిలబెట్టామని తెలిపారు. "మేం అధికారం చేపట్టినప్పుడు తెలంగాణ అన్ని రంగాల్లో తీవ్రమైన సంక్షోభంలో ఉంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆ సంక్షోభం నుంచి బయటపడి, అభివృద్ధి-సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నాం" అని పేర్కొన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటి ప్రతి రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడుతున్నాయని అన్నారు.

మీడియా మార్పులకు అనుగుణంగా పరుగులు పెట్టాలి

అయితే, ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ప్రజల్లోకి చేరడం లేదని మంత్రి అన్నారు. ప్రజలకూ ప్రభుత్వానికీ వారధిగా ఉండాల్సిన ప్రజా సంబంధాల అధికారుల పాత్ర మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత మీడియా మార్పులకు అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియా సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వేగంగా విస్తరిస్తున్న సోషల్ మీడియాను ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి శక్తివంతమైన సాధనంగా వినియోగించాలని అన్నారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్‌వోలను నియమించాలని, ఇతర విభాగాలలో ఉన్నవారి డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఐఅండ్‌పీఆర్ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐడిసీ చైర్మన్ ముప్వ విజయబాబు, సమాచార, పౌరసంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, సీఎం సీపీఆర్వో జి. మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్ రావు కస్టడీ పొడిగింపు

- సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వు
- సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 19: ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు మరో కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన నిందితుడిగా పేర్కొన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టడీ వారం పాటు పొడిగింపు ఇస్తున్నట్లు ఆదేశాలలో పేర్కొంది. ఇంటిరియ్ ప్రోటెక్షన్ రద్దు చేస్తూ వారం రోజుల పాటు సిట్ కస్టడికి ఇస్తూ 11న ఆదేశాలు జారీ చేసింది. 18వ తేదీ వరకు విచారించిన సిట్ బృందం విచారణ నివేదికను శుక్రవారం సుప్రీంకోర్టుకు అందజేసింది. నివేదికలో ప్రభాకర్ రావు సహకరించలేదని సిట్ బృందం పేర్కొనడంతో మరో వారం రోజుల పాటు కస్టడీ విచారణ పొడిగించింది. ఈ నెల 25 వరకు జూబ్లి హిల్స్ పోలీస్ స్టేషన్లో ప్రభాకర్ రావును సిట్ బృందం విచారరిచనుంది. సిట్ విచారణకు సహకరించాలని ధర్మాసనం మరోసారి ఆదేశాల్లో పేర్కొంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో నూతన సిట్ బృందాన్ని డీజీపీ శివధర్ రెడ్డి గురువారం ప్రకటించారు. రామగుండం సీపీ అంబర్ కిషోర్ జాను విచారణ అధికారిగా 9 మంది అధికారులతో సిట్ బృందాన్ని నియమించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక ఆధారాలుగా భావిస్తున్న ప్రభాకర్ రావు స్టేట్మెంట్, ఆయన ఐ ఫోన్ , లాప్ టాప్ , ఐ క్లౌడ్ పాస్ వార్డులను రాబట్టేందుకు సిట్ బృందం వారం రోజుల పాటు విచారించనున్నట్లు తెలుస్తోంది.

వర్నిలో నకిలీ నోట్ల కలకలం

- బ్యాంకు లోన్ చెల్లించేందకు వచ్చిన రైతు
- అతడిచ్చిన నగదు దొంగ నోట్లుగా గుర్తించిన అధికారులు
- అధికారులు అడిగేలోపే రైతు పరారీ

ప్రతిపక్షం, నిజామాబాద్, డిసెంబర్ 19: నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో దొంగ నోట్ల వ్యవహారం కలకలం రేపింది. స్థానిక కెనరా బ్యాంక్‌లో పంట రుణం చెల్లించేందుకు రైతు తీసుకువచ్చిన నగదును దొంగ నోట్లుగా అధికారులు గుర్తించారు. రైతు తీసుకు వెళ్లిన రూ. 2,08,500 నగదు మొత్తం బ్యాంక్ అధికారులు నకిలీవిగా తేల్చారు. మొత్తం రూ. 500 నోట్లుగా గుర్తించారు. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నరెడ్ల చిన్న సాయిలు గతంలో కెనరా బ్యాంకులో రుణం తీసుకున్నాడు. ఈ నగదు చెల్లించేందుకు గురువారం మధ్యాహ్నం కెనరా బ్యాంకులు వెళ్లాడు. కౌంటర్‌లో ఆ నగదును చెల్లించాడు. అనంతరం ఈ నగదును బ్యాంకు సిబ్బంది లెక్కిస్తుండగా.. అవి నకిలీ నోట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని బ్యాంక్ ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ నగదు ఎక్కడి నుంచి తీసుకు వచ్చావంటూ రైతు నరెడ్ల చిన్న సాయిలును బ్యాంకు అధికారులు, సిబ్బంది నిలదీశారు. దాంతో రైతు అక్కడి నుంచి పరారైయ్యాడు. దీనిపై పోలీసులకు బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు చేశారు. రైతు కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే ఇటీవల వర్నిమండలంలోఈ రైతు తన ధాన్యాన్ని మిల్లర్లకు బ్రోకర్ ద్వారా విక్రయించాడు. అతడికి వారు నగదు చెల్లించినట్లు సమాచారం అందుతుంది. చిన్న సాయిలు.. తన సోదరి ఇచ్చిన నగదు మొత్తం బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నగదు ఒక్కడే ఇచ్చాడా? లేకుంటే వేర్వేరు ప్రాంతాల నుంచి తెచ్చాడా? అనేది తేలాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రిస్మస్ వేడుకలకు రండి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మైనార్టీ మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు శుక్రవారం కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్ తో పాటు పలువురు క్రిస్టియన్ మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

ప్రతిపక్షం, హైదరాబాద్

నైనీలో థర్మల్ పవర్ ప్లాంట్

ఏర్పాటుపై ఆలోచిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ఒరిస్సా సీఎం మాఝితో సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: సింగరేణి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నైనీ కోల్ బ్లాక్ పిట్ హెడ్ వద్ద థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై తెలంగాణ అధికారుల బృందం అధ్యయనం చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఒడిస్సా సీఎం మోహన్ చరణ్ మాఝితో బేగంపేటలోని ఓ హోటల్లో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఇంధన శాఖ అధికారుల బృందం నైనీ ప్రాంతాన్ని సందర్శించి అంచనాలు రూపొందిస్తుందని తదుపరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ విట్టల్, సింగరేణి సిఎండి కృష్ణ భాస్కర్ సింగరేణి అధికారులు సత్యనారాయణ, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు, ఉద్యోగులకు గుడ్ న్యూస్

- వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సేవల విస్తరణ
- నిమ్స్ పరిధిలోకి కూకట్‌పల్లి, ఖైరతాబాద్ సెంటర్లు
- మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నిర్వహణలోకి మరో 10 సెంటర్లు
- అందుబాటులోకి రానున్న స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లు
- ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: ఉద్యోగులు, జర్నలిస్టులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈజేహెచ్ఎస్ (ఎంప్లాయీస్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్) వెల్‌నెస్ సెంటర్లలో సేవలను విస్తరించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్లలో కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే అంశంపై మంత్రి శుక్రవారం అధికారులతో సమీక్ష చేశారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈజేహెచ్ఎస్ పరిధిలోని జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నిర్వహిస్తోంది. సేవల విస్తరణ ప్రణాళికలో భాగంగా.. ఖైరతాబాద్, కూకట్‌పల్లి వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను నిమ్స్‌కు, మిగిలిన 10 వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మెడిసిన్, డెంటల్, ఫిజియోథెరపీ వంటి సేవలను వెల్‌నెస్ సెంటర్లు అందిస్తున్నాయి. కొన్నిచోట్ల గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ సేవలు అందుతున్నాయి. ఇకపై జనరల్ సర్జరీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, పీడియాట్రిక్స్, న్యూరాలజీ, డెర్మటాలజీ వంటి స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను కూడా వెల్‌నెస్ సెంటర్లలో దశలవారీగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆయా స్పెషాలిటీలకు సంబంధించిన డాక్టర్లను, సిబ్బందిని వెల్‌నెస్ సెంటర్లలో నియమించడంతో పాటు, పేషెంట్లకు టెస్టులు చేసేందుకు అవసరమైన పరికరాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెంటర్లలో పేషెంట్లకు అవసరమైన వెయిటింగ్ ఏరియా, ఇతర సౌకర్యాలను మెరుగుపర్చాలని సూచించారు. వెల్‌నెస్ సెంటర్లలో మెడిసిన్స్ అందుబాటులో లేవంటూ ఉద్యోగులు, జర్నలిస్టుల నుంచి ఫిర్యాదులు వచ్చే పరిస్థితి ఉండకూడదన్నారు. అవసరమైన అన్నిరకాల మెడిసిన్స్‌ను అన్ని వెల్‌నెస్ సెంటర్లలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మెడిసిన్ ఇండెంట్ నుంచి కొనుగోలు వరకూ పూర్తి ప్రక్రియ డిజిటల్‌గానే జరగాలని మంత్రి ఆదేశించారు. కొనుగోలు, సప్లైలో జాప్యం ఉండకూడదన్నారు. ఆన్‌లైన్‌లో ఓపీ బుక్ చేసుకునేందుకు వీలుగా యాప్‌ను సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళల ఉత్సవం

- స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ మాదాపూర్ ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ హస్త కళ ఉత్సవం ఈ నెల 20 నుండి శిల్పారామం లో ప్రారంభమవుతుంది. హైదరాబాద్ క్రాఫ్ట్స్ ప్రేమికులు, చేనేత కళాకారుల ప్రయోజనార్థం డెవలప్మెంట్ అఫ్ కమిషనర్, మినిస్ట్రీ అఫ్ టెక్స్టైల్స్, నేషనల్ జ్యూట్ బోర్డు, శిల్పారామం సంయుక్త నిర్వహణలో దాదాపుగా 450 స్టాల్స్ శిల్పారామం మాదాపూర్లో ఏర్పాటు చేయనున్నారు. ఆహ్లాదకరమైన ఆవరణలో నేటి నుండి చేనేత ఉత్సవం ప్రారంభమవుతుంది. ప్రతి రోజు శాస్త్రీయ, జానపద, సంగీత వాయిద్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చేనేత హస్తకళాకారులను ప్రోత్సహించవలసినదిగా శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్ రావు కోరారు.

అక్షర తపస్వి 'అప్పలాచారి' ఇక లేరు

- భగవద్గీతను ఉర్దూలోకి అనువదించిన సృష్టికర్త కన్నుమూత



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: ఒక చేత్తో గణితం.. మరో చేత్తో సాహిత్యం.. ఒక కన్ను తెలుగు.. మరో కన్ను ఉర్దూ.. వెరసి 96 ఏళ్ల సంపూర్ణ విద్యా సంస్కారాల మూర్తిమత్వం ఎస్టీవీ అప్పలాచార్యులు శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తెలుగు, ఉర్దూ సాహిత్య లోకానికి తీరని లోటు. గీతను 'నగ్మే ఇలాహి'గా మార్చిన మహా మనీషి అప్పలాచారి. జీవితంలో అత్యంత అద్భుతమైన ఘట్టం భగవద్గీతను ఉర్దూలోకి "నగ్మే ఇలాహి" పేరుతో అనువదించడం. హిందూ ధర్మ శాస్త్రాన్ని ముస్లిం సోదరులకు కూడా అర్థమయ్యేలా, అత్యంత మధురమైన ఉర్దూ శైలిలో ఆయన చేసిన ఈ రచన ఒక చారిత్రక అవసరం. ప్రపంచ ప్రసిద్ధ గీతా ప్రెస్ (గోరఖ్‌పూర్) వారు ఈ పుస్తకాన్ని ప్రచురించడం ఆయన ప్రతిభకు దక్కిన అతిపెద్ద గౌరవం. ఉత్తర భారతంలో ఈ పుస్తకం విశేష ఆదరణ పొంది, మూడు సార్లు పునర్ముద్రణ భాగ్యం పొందిందంటే, ఆయన ఎంతటి హృద్యంగా ఆ అనువాదాన్ని చేశారో అర్థం చేసుకోవచ్చు.

క్యాన్సర్‌ను జయించి.. నిఘంటువును నిర్మించి..

ఆయన సంకల్పం వజ్ర సమానం. 75వ ఏట ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడినా, భగవత్ కృపతో దానిని జయించారు. జబ్బును జయించడమే కాకుండా, తన విశ్రాంతి కాలంలో రెండేళ్ల పాటు శ్రమించి 'తెలుగు-ఉర్దూ నిఘంటువు'ను రూపొందించారు. వృద్ధాప్యం శరీరానికే కానీ తన మేధస్సుకు కాదని ఆయన నిరూపించారు. 96 ఏళ్ల వయసులో కూడా ఆయనలోని జిజ్ఞాస నేటి తరానికి ఆదర్శప్రాయం. ఉర్దూ మీడియంలో చదువుకుని, గణిత శాస్త్రాన్ని ఆపోశన పట్టిన ఆయన, ఎస్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. తెలుగు పండిత శిక్షణలో సైకాలజీ బోధించడం నుండి, గణితాన్ని మూడు భాషల్లో అనర్గళంగా వివరించడం వరకు ఆయన ప్రస్థానం అద్వితీయం.

జీరో పర్మిషన్‌తో అక్రమ గోడౌన్ నిర్మాణాలు

- అక్రమాలపై వివరణ అడిగితే ముఖం చాటుకుంటున్న అధికారులు
- హాట్ టాపిక్ గా మారడంతో పై స్థాయి అధికారులకు నివేదిక సమర్పణ
- ఉన్నత స్థాయి అధికారులకు మభ్య పెట్టేందుకే నివేదిక సమర్పణపై ప్రజల ఆగ్రహం

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసంబర్ 19: దేవర్ యాంజాల్ లోని దేవదాయ శాఖ భూములలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు బిల్ కలెక్టర్ నుండి జిల్లా కలెక్టర్ వరకు తెలిసిందే. ఈ భూములలో నిర్వహించే అక్రమ నిర్మాణాలు తెరపైకి రావడంతో తూంకుంట, దేవర్ యాంజాల్ పట్టణ ప్రజల్లో చర్చ తీవ్ర చర్చ జరుగుతోంది. దీనిపై సంభంధిత అధికారులు చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీరో పర్మిషన్ తో అక్రమ షెడ్డులు, గోడౌన్ లు నిర్వహించి లక్షల్లో కిరాయిలు జమ చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమాలు నిర్వహిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సంభంధిత అధికారులు వారిని సమర్థిస్తున్నారని ఆరోపణలున్నాయి. తుంకుంట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతిని దీనిపై దాదాపు 10 రోజులనుండి వివరణ కోరితే టీపిఓ విభాగంలో అడగాలని తప్పించుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం దేవదాయ శాఖ భూములలో జరుగుతున్న అక్రమాలపై పైస్థాయి అధికారులకు డిప్యుటీ కమిషనర్ జ్యోతి నివేదిక సమర్పించారని చెబుతున్నా, అది కేవలం ఉన్నత అధికారులను మభ్య పెట్టడానికేనని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందునుండే అక్రమాలపై దృష్టి పెడితే కొన్ని భూములు మిగిలి ఉండేవని వాపోతున్నారు. గ్రామ పంచాయితీ ఉన్న సమయంలో అప్పటి సర్పంచ్ కూడా ఈ భూములకు స్థాంపులు కొట్టి పర్మిషన్లు ఇచ్చారని దేవర్ యంజాల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం తుంకుంట మున్సిపల్ కావడంతో మున్సిపల్ కమిషనర్ లు ఎంతమంది వచ్చిన అక్రమాలకు చెక్ పెట్టకుండా వారికి ప్రోత్సాహించి డోర్ నెంబర్లను కూడా ఇచ్చారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్ దీనిపై దృష్టి సారించి దేవదాయ శాఖ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

డిప్యూటీ కమిషనర్ జ్యోతి

అక్రమాలను అరి కట్టడానికి శుక్రవారం జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, ఆర్డీఓ, డీపీఆర్ఓ, హైడ్రాకు నివేదిక సమర్పించాను. త్వరలో అక్రమాలను గుర్తించి వాటిని కూల్చివేసి, అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటాం.

రామరాజ్యం కోసమే 'ఉపాధి' చట్టం పేరు మార్పు

- పంచాయితీల్లో బీజేపీకి మంచి ఓటింగ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్19: గత ఎన్నికలతో పోల్చితో ఈసారి బీజేపీ గణనీయమైన పురోగతి సాధించిందని, రామరాజ్యం, గ్రామ స్వరాజ్యం కోసమే ఉపాధి హామీ పథకం పేరు మార్చడం జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. తాజాగా ఎన్నికల ఫలితాలు, ట్రెండ్స్ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు నిర్మల్‌లో జరిగిన సర్పంచులు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాట్లాడారు. గతంలో ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో కూడా ఈసారి బీజేపీకి మంచి ఓటింగ్ జరిగిందన్నారు. కేంద్రం తీసుకువస్తున్న పథకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయని, ఈ క్రమంలోనే రోజు రోజుకీ బీజేపీపై ప్రజలకు విశ్వాసం పెరిగిపోతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం నిధులతో జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వం నిధులను తమ స్వలాభం కోసం ఖర్చు చేయకుండా చూడాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ విజయాల గురించి గొప్పలు చెప్పుకుంటున్నాయని, చాలా చోట్ల అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయని విమర్శించారు. మహాత్మా గాంధీ అంటే బీజేపీకి ఎంతో గౌరవం అని, రామరాజ్యం, గ్రామ స్వరాజ్యం కోసమే ఉపాధి హామీ పథకం పేరు మార్చడం జరిగిందని అన్నారు. ఉపాధి హామీ పథకం ఇంతకు ముందు 100 రోజులు ఉంటే దాన్ని కేంద్ర ప్రభుత్వం 120 రోజులకు పెంచిందని, దీని వల్ల ఎంతో మంది నిరుపేదలకు లాభం చేకూరుతుందని తెలిపారు.

పార్టీ సంస్థాగత నిర్మాణానికి 35 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నాం. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సభ్యులందరి డేటాను డిజిటలైజ్ చేస్తాం. అంతా పూర్తయితే 16 నుంచి 18 లక్షల మంది సైన్యం సిద్ధమవుతుంది. జగన్ మంచి పాలన అందించారు. ఏం కోల్పోయారో ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోంది. ఆటుపోట్లెన్నిఉన్నా నిరంతర పోరాటమే లక్ష్యం.

-వైసీపీ నేత
సజ్జల రామకృష్ణారెడ్డి

తెరపైకి హెరాల్డ్ రగడ

దేశరాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసిన అంశాల్లో నేషనల్ హెరాల్డ్ కేసు ఒకటి. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను లక్ష్యంగా చేసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ద్వారా బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ ఆరోపణలు చేసింది. ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టు కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకోలేమని కోర్టు తెలిపింది. పీఎంఎల్ఏ చట్టం ప్రకారం మనీలాండరింగ్ కేసు కొనసాగడానికి షెడ్యూల్డ్ ఆఫెన్స్ (అంతర్లీన నేరం) ఆధారంగా ఎఫ్ఐఆర్ ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. ఇది కాంగ్రెస్‌కు ఊరట కలిగించే అంశమైనప్పటికీ, కోర్టు నిర్ణయాన్ని ఈడీ సవాల్ చేసే అవకాశముంది. గత నవంబర్‌లో ఈడీ సమాచారం ఆధారంగా ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు రాహుల్‌పై కక్ష సాధింపు చర్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. నేషనల్ హెరాల్డ్ కేసు నేపథ్యం ఒకసారి పరిశీలిద్దాం. 1938లో నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) అనే సంస్థ ఈ పత్రికను ప్రచురించేది. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ పత్రికను నిషేధించింది. 1945లో తిరిగి ప్రారంభమైన నేషనల్ హెరాల్డ్ పత్రికను ఆర్థిక కారణాలతో 2008లో మూసేయాల్సి వచ్చింది. నేషనల్ హెరాల్డ్‌ను మూసే సమయానికి ఏజేఎల్ సంస్థకు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల మేర బకాయి పడినట్లు సమాచారం. 2012లో బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి ఢిల్లీలోని స్థానిక ట్రయల్ కోర్టులో గాంధీ కుటుంబం మీద కేసు వేశారు. ఏజేఎల్ సంస్థకు చెందిన 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను హస్తగతం చేసుకోవడం కోసం, ఆ సంస్థను తమ యాజమాన్యంలోకి తెచ్చుకోవటానికి కాంగ్రెస్ పార్టీ నిధులను ఉపయోగించుకుందని ఆయన ఆరోపించారు. సుబ్రమణియన్ ఫిర్యాదు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్లకు పైగా వడ్డీలేని రుణం ఇచ్చిందని ఈడీ పేర్కొంది. ఆ రుణాన్ని రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు... మెజార్టీ వాటాలు ఉన్నయంగ్ ఇండియన్ లిమిటెడ్ (వైఐఎల్) సంస్థ ద్వారా రూ.50 లక్షలు మాత్రమే చెల్లించి.. ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ. 2 వేల కోట్లు సొంతం చేసుకున్నారని ఈడీ ఆరోపించింది. ఇది మనీలాండరింగ్ చర్య కిందకు వస్తుందంటూ ఈడీ 2025 ఏప్రిల్ లో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. కాగా ఈ కేసు దశాబ్దకాలంగా రాజకీయ వివాదంగా మారింది.నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్ర్యోద్యమంతో ముడిపడి ఉండటం, దాని ఆస్తులు ఢిల్లీ, ముంబై, లక్నోల్లో ఉండటంతో వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ నాయకులు ఇది పత్రికను పునరుజ్జీవింపజేయడానికి చేసిన ప్రయత్నమని వాదిస్తుంటే, ఇది ఆస్తుల దుర్వినియోగమని ఈడీ ఆరోపిస్తోంది. తాజా కోర్టు నిర్ణయంతో సోనియా, రాహుల్‌లకు ఊరట లభించినప్పటికీ, కేసు పూర్తిగా ముగిసినట్టు కాదు. భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు జరగవచ్చు.బ్లాక్ మనీని (చట్ట వ్యతిరేకంగా, అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన డబ్బు)ను వైట్ మనీగా (చట్టబద్ధంగా) మార్చే ప్రక్రియనే మనీ లాండరింగ్ అని అంటారు. అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన లేదా ఆదాయానికి మించి సమకూరిన సంపాదనను బ్లాక్ మనీ అని అంటారు.మనీ లాండరింగ్‌లో వివిధ దశలను, చోటు చేసుకునే విధానాన్ని బెంగళూరుకు చెందిన ఒక కార్పొరేట్ సంస్థలో యాంటీ మనీ లాండరింగ్ విభాగానికి నేతృత్వం వహిస్తున్న బిపిన్ నాయిర్ బీబీసీకి వివరించారు. మనీ లాండరింగ్ ప్లేస్‌మెంట్, లేయరింగ్, ఇంటెగ్రేషన్ అనే మూడు దశల్లో జరుగుతుంది. చట్ట వ్యతిరేకంగా సేకరించిన డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టే దశను ప్లేస్‌మెంట్ అని అంటారు. మరొక రకంగా చెప్పాలంటే అక్రమంగా సంపాదించిన డబ్బును సక్రమ మార్గాల ద్వారా సంపాదించినట్లు చూపించే దశ. వస్తువులను మారు పేర్లతో రవాణా చేయడం (విలాసవంతమైన వస్తువులను తక్కువ విలువున్న వస్తువులుగా చూపించడం), ఉత్పత్తులను, సేవలను కొనకుండా కొన్నట్లు బిల్లులు చూపించడం ఇన్‌వాయిస్ మోసం కిందకే వస్తుంది.షెల్ కంపెనీలు, ఉనికిలోలేని సంస్థల నుంచి సామగ్రి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని వివరించేందుకు ఇంటెగ్రేషన్‌ను చాలా జాగ్రత్తగా చేస్తారు. తిరిగి ఈ డబ్బంతా రకరకాల అకౌంట్లు, వ్యక్తుల చుట్టూ తిరిగి నేరస్థుడు లేదా అసలైన యజమానిని చేరుతుంది. ఈ దశలో బ్లాక్ మనీకి, వైట్ మనీకి మధ్య తేడా కనిపెట్టడం చాలా కష్టంగా మారుతుంది

హైదరాబాద్,

శనివారం
20.12.2025

‘మేధో వలసల’ నిశ్శబ్ద విప్లవం

దేశం అసలు ఏ దిశగా పయనిస్తోందన్న విషయంలో ఒక అంతుచిక్కని అయోమయం నెలకొంది. ఒకవైపు ప్రభుత్వం దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా అవతరిస్తోందని, ప్రపంచం భారత్ వైపు చూస్తోందని ఘనంగా ప్రకటిస్తోంది, కానీ అదే సమయంలో లక్షలాది మంది పౌరులు తమ పౌరసత్వాన్ని ఎందుకు వదులుకుంటున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. ఆర్థిక వ్యవస్థ అంత బలంగా ఉంటే, మేధావులు, సంపన్నులు తమ దేశాన్ని వదిలి ఎందుకు పారిపోతున్నారు? నిరంతరం వినిపిస్తున్న దేశభక్తి ప్రసంగాలు, భావోద్వేగ పూరిత నినాదాల మధ్యే లక్షలాది మంది తమ పాస్‌పోర్ట్‌లను ఎందుకు త్యాగం చేస్తున్నారు? ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంస్కరణలు దేశాభివృద్ధి కోసమా లేక ఇక్కడి మేధస్సును ఇతర దేశాలకు తరలించడానికా అన్నది ఒక మిస్టరీగా మారింది.

వెంక గారి భూమయ్య
9848559863

భారతదేశం నేడు ఒక అత్యంత క్లిష్టమైన మరియు విచిత్రమైన సంధిగ్ధంలో పయనిస్తోంది, ఒకవైపు ప్రపంచ వేదికపై ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, అగ్రరాజ్యాల సరసన నిలబడాలని తహతహలాడుతూ 'విశ్వగురువు' నినాదాలు వినిపిస్తుంటే, మరోవైపు దేశంలోని అత్యున్నత మేధో సంపత్తి మరియు అపారమైన సంపద ఎవరికీ కనబడకుండా నిశ్శబ్దంగా సరిహద్దులు దాటిపోతోంది. ఈ పరిణామం కేవలం పాస్‌పోర్ట్‌ల మార్పుకు సంబంధించినది మాత్రమే కాదు, దేశ భవిష్యత్తు పునాదులను కదిలిస్తున్న ఒక లోతైన సామాజిక, ఆర్థిక మరియు మానసిక సంక్షోభం. గడచిన ఐదు సంవత్సరాలలో దాదాపు తొమ్మిది లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం వెనుక దేశంలో నెలకొన్న అస్థిరమైన సామాజిక వాతావరణం, రాజకీయ వైషమ్యాలు మరియు భారమైన ఆర్థిక పరిస్థితులు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా 2014 నుండి ఈ ధోరణి మునుపెన్నడూ లేని విధంగా ఊపందుకోవడం చూస్తుంటే, సామాన్య పౌరులలో భవిష్యత్తుపై భరోసా క్రమంగా సన్నగిల్లుతోందా అనే సందేహం కలగక మానదు. దేశంలో జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారుతున్నాయని, సంక్లిష్టమైన పన్నుల విధానం సామాన్యుడి నుండి బడా పారిశ్రామికవేత్తల వరకు ప్రతి ఒక్కరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తోందని సామాజిక విశ్లేషకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశం కోసం త్యాగాలు చేయాలనే భావం కంటే, తమ నైపుణ్యానికి తగిన గుర్తింపు, గౌరవం మరియు సరైన ఉపాధి అవకాశాలు లభించే చోట స్థిరపడడమే మేలని మేధావులు భావిస్తున్నారు. ఈ బ్రెయిన్ డ్రైన్ వల్ల భారతదేశం తన విలువైన మానవ వనరులను కోల్పోవడమే కాకుండా, నైపుణ్యం కలిగిన యువతను విదేశీ సంస్థలకు ధారపోస్తోంది. సంపన్నవర్గాలు సైతం దేశంలోని వ్యవస్థల తీరుపై నమ్మకాన్ని కోల్పోతూ, తమ పెట్టుబడులను సురక్షితమైన మరియు స్థిరమైన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలకు తరలిస్తున్నాయి. ఈ విదేశీ వలసలు కేవలం ఆర్థిక లాభాల కోసమే కాకుండా, దేశంలో పెరుగుతున్న అసహనం, రాజకీయ స్వార్థం మరియు వాస్తవ సమస్యలను పక్కన పెట్టి భావోద్వేగపూరిత అంశాలకు లభిస్తున్న అమితమైన ప్రాధాన్యత వల్ల కూడా సంభవిస్తున్నాయి. ప్రతి ఏటా లక్షలాది మంది మేధావులు దేశం విడిచి వెళ్లడం వల్ల ఆవిష్కరణలు, శాస్త్ర సాంకేతిక పరిశోధనల రంగంలో భారత్ ప్రపంచ దేశాల కంటే వెనుకబడిపోయే ప్రమాదం పొంచి ఉంది. పౌరసత్వాన్ని వదులుకుంటున్న వారిలో అధిక శాతం ఉత్పాదక శక్తి కలిగిన యువత ఉండడం భవిష్యత్తులో దేశ జనాభా సమతుల్యతను, ఆర్థిక పురోగతిని తీవ్రంగా దెబ్బతీస్తుంది. ప్రభుత్వం కేవలం జిడిపి గణాంకాలను చూపిస్తూ అభివృద్ధిని సమర్థిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మేధావుల వలసలు దేశ అభివృద్ధి వెనుక ఉన్న డొల్లతనాన్ని, వ్యవస్థాగత లోపాలను బహిర్గతం చేస్తున్నాయి. ఈ నిశ్శబ్ద నిష్క్రమణను అరికట్ట

డానికి పాలకులు తక్షణమే వాస్తవిక చర్యలు చేపట్టకపోతే, భారత్ కేవలం శ్రామిక శక్తిని ఎగుమతి చేసే దేశంగా మిగిలిపోయే ముప్పు ఉంది.

నిర్బంధ ఆర్థిక విధానాలు మరియు వేధింపుల భీతి

ప్రస్తుత భారతీయ వ్యాపార వాతావరణంలో 'టాక్స్ టెర్రరిజం' అనే పదం ఒక అప్రకటిత భయంలా మారింది. దేశంలో సంపదను సృష్టించే వారిని, ఉద్యోగాలను కల్పించే వారిని ప్రోత్సహించాల్సింది పోయి, ప్రతిరోజూ మారుతున్న పన్ను నిబంధనలు, దర్యాప్తు సంస్థల నిరంతర నిఘా మరియు రాజకీయ జోక్యం సంపన్నులను బెంబేలెత్తిస్తున్నాయి. నియమ నిబంధనల పేరుతో సాగుతున్న ఈ వేధింపుల వల్ల, శాంతియుతంగా వ్యాపారం చేసుకోలేమని భావించి చాలా మంది బడా పారిశ్రామికవేత్తలు దుబాయ్, సింగపూర్ లేదా యూరప్ దేశాల్లో స్థిరపడుతున్నారు. సంపన్న వర్గాలు తమ మూలధనాన్ని తరలించడం వల్ల దేశంలో కొత్త పరిశ్రమల స్థాపన ఆగిపోవడమే కాకుండా, ఉన్న ఉపాధి అవకాశాలు కూడా కనుమరుగవుతున్నాయి. మధ్యతరగతి మేధావి వర్గం సైతం పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పరోక్ష పన్నుల భారం భరించలేక, విదేశాల్లో కష్టపడినా కనీసం తమ శ్రమకు తగ్గ ఫలితం మరియు నాణ్యమైన జీవితం దొరుకుతుందనే ఆశతో దేశాన్నే వదులుకుంటున్నారు.

ప్రజాస్వామ్య విలువలు, సామాజిక అశాంతి

దేశంలో నెలకొన్న సామాజిక పరిస్థితులు కూడా ఈ వలసలకు ఒక బలమైన కారణంగా మారుతున్నాయి. మేధావి వర్గం మరియు కళాకారులు దేశంలో తమ భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, సమాజంలో పెరుగుతున్న విభజన ధోరణులు భవిష్యత్తులో అశాంతికి దారితీస్తాయని భయపడుతున్నారు. విద్యారంగంలో సైతం మెరిట్ కంటే రాజకీయ మరియు సామాజిక సమీకరణాలకే ప్రాధాన్యత లభిస్తుండడంతో, ప్రతిభావంతులైన విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల వైపు మొగ్గు చూపుతున్నారు. అక్కడ విద్య పూర్తి చేసిన వారు తిరిగి మాతృభూమికి రావడానికి ఇష్టపడకపోవడం వెనుక ఇక్కడి వ్యవస్థల పట్ల ఉన్న అపనమ్మకం స్పష్టంగా కనిపిస్తోంది. కోట్లు సంపాదించినా స్వచ్ఛమైన గాలిని పీల్చుకోలేని మెట్రో నగరాల దుస్థితి, అస్తవ్యస్తమైన మౌలిక సదుపాయాలు పౌరులను విదేశీ పౌరసత్వం వైపు ప్రేరేపిస్తున్నాయి.

తీరని అయోమయం... వికాసమా లేక వినాశనమా?

అయితే, ప్రస్తుత పరిస్థితులను లోతుగా పరిశీలిస్తే దేశం అసలు ఏ దిశగా పయనిస్తోందన్న విషయంలో ఒక అంతుచిక్కని అయోమయం నెలకొంది. ఒకవైపు ప్రభుత్వం దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా అవతరిస్తోందని, ప్రపంచం భారత్ వైపు చూస్తోందని ఘనంగా ప్రకటిస్తోంది, కానీ అదే సమయంలో లక్షలాది మంది పౌరులు తమ పౌరసత్వాన్ని ఎందుకు వదులుకుంటున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. ఆర్థిక వ్యవస్థ అంత బలంగా ఉంటే, మేధావులు, సంపన్నులు తమ దేశాన్ని వదిలి ఎందుకు పారిపోతున్నారు? నిరంతరం వినిపిస్తున్న దేశభక్తి ప్రసంగాలు, భావోద్వేగ పూరిత నినాదాల మధ్యే లక్షలాది మంది తమ పాస్‌పోర్ట్‌లను ఎందుకు త్యాగం చేస్తున్నారు? ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంస్కరణలు దేశాభివృద్ధి కోసమా లేక ఇక్కడి మేధస్సును ఇతర దేశాలకు తరలించడానికా అన్నది ఒక మిస్టరీగా మారింది. విదేశాల్లో ఉన్న భారత సంతతి విజయాలను చూసి గర్వపడుతున్న పాలకులు, స్వదేశంలో ఉన్న నైపుణ్యాన్ని ఎందుకు కాపాడుకోలేకపోతున్నారు? డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా అని గొంతెత్తి చాటుతున్నప్పటికీ, అసలు 'మెదడు' అంతా విదేశాలకు ఎగుమతి అవుతుంటే, ఇక్కడ మిగిలేది కేవలం డొల్ల నినాదాలేనా? ఒకవైపు జనాభా మన బలం అని చెబుతూనే, మరోవైపు మేధావులంతా వెలివేసినట్టు వెళ్లిపోతుంటే అది దేశ ప్రగతి అవుతుందా లేక అంధకార పతనం అవుతుందా అన్న గందరగోళం ప్రతి ఆలోచనాపరుడిని వేధిస్తోంది. వలసలు పెరుగుతున్నాయా లేక పౌరులే తమ దేశాన్ని అసహ్యించుకుంటున్నారా అనే అయోమయ స్థితిలో భారతదేశ భవిష్యత్తు ఇప్పుడు ఒక అపరిష్కృత యక్ష ప్రశ్నలా మిగిలిపోయింది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

జనవరి తర్వాతే జాతకం!?

ఫిరోజ్ ఖాన్
9640466464

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం నెలకొన్న ఉత్కంఠకు తెరపడాలంటే మరో నెల రోజులు వేచి చూడక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేపట్టిన ఢిల్లీ పర్యటనలో మంత్రివర్గ ప్రక్షాళనపై గట్టి ప్రయత్నాలే చేసినప్పటికీ, అధిష్ఠానం మాత్రం ఇప్పుడే తొందరపడ వద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా సీనియర్ మంత్రుల తొలగింపు వంటి కీలక నిర్ణయాల వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తి, అవి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతాయని హైకమాండ్ ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో, మంత్రుల భవితవ్యం కొత్త వారి చేరికకు సంబంధించిన రాజకీయ జాతకం అంతా 2026 జనవరి మాసం తర్వాతే తేలనుందని ఢిల్లీ వర్గాల సమాచారం. అప్పటి వరకు ప్రస్తుత మంత్రులందరూ తమ పదవుల్లో కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.

అసంపూర్ణ సమీకరణాలు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2025 డిసెంబర్ 13 నుండి 17 వరకు నిర్వహించిన ఐదు రోజుల ఢిల్లీ పర్యటన అనేక ఆశలతో ప్రారంభమైంది. రాష్ట్రంలో పాలనను మరింత వేగవంతం చేసేందుకు మంత్రివర్గంలో మార్పులు అవసరమని, ముఖ్యంగా పనితీరు మందగించిన మంత్రులను తొలగించి, ఉత్సాహవంతులైన కొత్త వారికి అవకాశం ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ అంతర్గత సంప్రదాయాల ప్రకారం సీనియర్ నేతలను హఠాత్తుగా తొలగించడం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తుందని అధిష్ఠానం భావించింది. ఫలితంగా, రేవంత్ రెడ్డి ఆశించిన స్థాయి ప్రక్షాళనకు ఢిల్లీ పెద్దలు ప్రస్తుతానికి పచ్చజెండా ఊపలేదనట్లు తెలుస్తుంది.

అధిష్ఠానం అప్రమత్తత..

రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీకి అత్యంత కీలకం. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారానే ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పును నిరూపించుకోవాలని హైకమాండ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఒకవేళ ఇప్పుడు మంత్రివర్గంలో మార్పులు చేస్తే, పదవులు కోల్పోయిన నేతలు ఎన్నికల సమయంలో అసమ్మతిని రాజేసే ప్రమాదం ఉంది. ముప్పును పసిగట్టిన అగ్ర నాయకత్వం, ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎటువంటి మార్పులు చేయవద్దని ముఖ్యమంత్రిని ఆదేశించింది. జనవరి నాటికి ఎన్నికల హడావిడి తగ్గుతుందని, ఆ తర్వాతే ప్రక్షాళన గురించి

ఆలోచించవచ్చని ఢిల్లీ పెద్దలు సూచించినట్లు తెలుస్తోంది.

రాజ్యాంగబద్ధమైన విశేషాధికారాలు..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 163 ప్రకారం మంత్రిమండలి కూర్పు, మార్పులపై ముఖ్యమంత్రికి విశేషాధికారాలు ఉన్నప్పటికీ, జాతీయ పార్టీలలో అధిష్ఠానం నిర్ణయమే తుది నిర్ణయం అవుతుంది. రేవంత్ రెడ్డికి 'ఫ్రీ హ్యాండ్' ఇస్తే సీనియర్ మంత్రులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ వంటి వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఢిల్లీకి ఫిర్యాదులు అంతున్నాయి. పార్టీలో సమతుల్యత దెబ్బతినకుండా చూడటమే అధిష్ఠానం ప్రాధాన్యతగా కనిపిస్తోంది. సీనియర్లను గౌరవిస్తూనే, వారి అనుభవాన్ని పాలనలో ఎలా ఉపయోగించుకోవాలో రేవంత్ రెడ్డికి అగ్ర నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ఇది ఒక రకంగా రేవంత్ రెడ్డి దూకుడుకు వేసిన కళ్లెంగానే రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

సామాజిక సమతుల్యత..

ప్రస్తుత మంత్రివర్గంలో అనేక సామాజిక వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా ముదిరాజులు, యాదవులు ఇతర వెనుకబడిన వర్గాల నుంచి మంత్రి పదవుల కోసం తీవ్రమైన ఒత్తిడి ఉంది. సామాజిక న్యాయం పాటించకుండా చేసే విస్తరణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలను ఇచ్చే అవకాశం ఉందని హైకమాండ్ భయపడుతోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలకు పదవిపై ఇచ్చిన హామీని అమలు చేయడంలో ఉన్న చట్టపరమైన మరియు రాజకీయ చిక్కులను కూడా అధిష్ఠానం పరిశీలిస్తోంది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం కనుగొనాలంటే మరింత సమయం అవసరమని, అందుకే జనవరి వరకు వేచి చూడాలని నిర్ణయించారు.

పాలనాపరమైన జవాబుదారీతనం..

పరిపాలనలో జవాబుదారీతనం ఉండాలని, కేవలం ముఖ్యమంత్రి కార్యాలయం నుండే అన్ని నిర్ణయాలు రావడం సరికాదని ఢిల్లీ పెద్దలు అభిప్రాయపడ్డారు. గతంలో జారీ చేసిన కొన్ని కీలక జీఓల (ప్రభుత్వ ఉత్తర్వులు) విషయంలో సంబంధిత మంత్రుల అభిప్రాయాలను తీసుకోకపోవడంపై అధిష్ఠానం అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. సామూహిక బాధ్యతతో ప్రభుత్వం నడవాలని, అందరినీ కలుపుకుని పోవడమే కాంగ్రెస్ మార్క్ పాలన అని రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రక్షాళనపై దృష్టి పెట్టకుండా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంత్రులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ పరిణామాలు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఒక హెచ్చరికగా మరియు సంస్కరణగా పరిగణించవచ్చు.

రాజకీయ స్థిరత్వమే పరమావధి..

రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ప్రస్తుతానికి ఎటువంటి మార్పులను తీసుకురాలేదు సరే కదా, రాజకీయ అనిశ్చితిని మరింత పెంచింది. మున్సిపల్ ఎన్నికల ముప్పును సాకుగా చూపి హైకమాండ్ తన పట్టును నిరూపించుకుంది. మంత్రుల భవితవ్యం ఇప్పుడు పూర్తిగా జనవరి తర్వాత వచ్చే ఫలితాలపై ఆధారపడి ఉంది. సీనియర్లను గౌరవించడం మరియు సామాజిక న్యాయం పాటించడం ద్వారానే పార్టీని బలోపేతం చేయవచ్చని అధిష్ఠానం విశ్వసిస్తోంది. ఈ ఐదు రోజుల హస్తిన పంచాయితీ తెలంగాణ కాంగ్రెస్‌లో సీనియర్ల ప్రాధాన్యతను మరోసారి చాటి చెప్పింది. రేవంత్ రెడ్డి తన తదుపరి వ్యూహాన్ని ఎలా రచిస్తారో వేచి చూడాలి.

(వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

జాతి కీర్తి సిగలో కలికితురాయి యామినీ కృష్ణమూర్తి

సుధాకర్ ఏవీ
9000674747

భారతీయ నర్తకి. భరతనాట్యం, కూచిపూడి,ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలు. కూచిపూడి నృత్యానికి దేశవిదేశాలలో పేరు తెచ్చిపెట్టింది. కర్ణాటక సంగీతం కూడా నేర్చుకుని పాటపాడుతూ నృత్యం చేసి ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లిలో 1940వ సంవత్సరం డిసెంబరు 20న జన్మించారు. ఈమె తండ్రి కృష్ణమూర్తి సంస్కృత పండితుడు.తాత ఉర్దూ కవి. అటుపై వాళ్ల కుటుంబం తమిళనాడులోని చిదంబరంలో స్థిరపడింది. భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం సంపాదించిన యామిని 1957లో తొలి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అప్పటి నుంచి వేలాదిగా ప్రదర్శనలిచ్చి దేశ, విదేశాల్లో పేరు పొందారు. ఈమె పూర్తి పేరు యామినీ పూర్ణతిలకం.తన తండ్రి ప్రోత్సాహంతో తన 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరత నాట్యము నేర్చుకోవడము ప్రారంభించింది. భరత నాట్యంలో ఈమె గురువులు కాంచీపురం ఎల్లప్ప పిళ్ళై, చొక్కలింగం పిళ్లై, బాలసరస్వతి, తంజావూర్ కిట్టప్ప, దండాయుధపాణి, మైలాపూర్ గౌరి అమ్మ మొదలైనవారు. ఈమె వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ వంటి వారి వద్ద కూచిపూడి నేర్చింది. పంకజ చరణ్‌దాస్, కేలూచరణ్ మహాపాత్రల వద్ద ఒడిస్సీ నేర్చుకొన్నది. ఎండీ రామనాథన్ దగ్గర కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకొంది. ఈమె తన తొలిప్రదర్శనను తన 17వ యేట చెన్నైలో 1957వ సంవత్సరంలో ఇచ్చింది. ఈమెకు 20 సంవత్సరాల వయసు వచ్చే సమయానికి ఈమె ఒక ప్రతిభావంతురాలైన నర్తకిగా గుర్తింపు పొందింది. ఆ క్రమంలో ఈమె తన మకామును ఢిల్లీకి మార్చింది. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నర్తనానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, బర్మా ఇత్యాది ఎన్నోదేశాలు పర్యటించి ఆయా చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య ప్రచారం చేయడం జరిగింది. వేదాలకు కొన్ని పసందైన జతులతో ఈమె కూర్చిన నృత్యం పాండిత్యానికి ఉదాహరణ. యామిని సేవలను గుర్తించిన ప్రభుత్వం 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్ 2016లో పద్మవిభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది. 2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. ఆపై యామిని కూచిపూడి నృత్యానికి సంబంధించి డీవీడీలు విడుదల చేశారు. తన నృత్యప్రస్థానాన్ని "రేణుకా ఖాండేకర్" సహకారంతో "ఎ ప్యాషన్ ఆఫ్ డాన్స్" పేరుతో పుస్తకంగా రాశారు. నృత్యకళ పట్ల జనసామాన్యంలో అవగాహన కలిగించడానికి అభిరుచి పెంచడానికి సుమారు మూడేండ్ల పాటు పరిశోధన చేసి "నృత్యమూర్తి" సీరియల్‌ను పదమూడు భాగాలుగా దూరదర్శన్ ప్రసారం చేసింది. ఫిలింస్ డివిజన్ ఆఫ్ ఇండియా 1971లో ఏల్చూరి విజయరాఘవ రావు సంగీత దర్శకత్వంలో "యామినీ కృష్ణమూర్తి" పై 20 నిమిషాల ఒక డాక్యుమెంటరీ సినిమా తీసింది.ఈమె ఉత్పలేందు చక్రవర్తి దర్శకత్వంలో వెలువడిన చందనీర్ అనే బెంగాలీ సినిమాలో తన పాత్రలోనే డా.యామినీ కృష్ణమూర్తి నటించింది. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చేరింది. యామినీ కృష్ణమూర్తి 84 సంవత్సరాల వయసులో 2024 ఆగస్టు 3న ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో కన్నుమూసింది.

(డిసెంబర్ 20 యామినీ కృష్ణమూర్తి జయంతి)

(వ్యాసకర్త ఎస్టీయూటీఎస్‌రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు)

ప్రాంతీయం

మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపీట

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 19 : మొయినాబాద్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ వార్డులోని అన్ని రోడ్ల అభివృద్ధికి నగర నిధులు రూ.94 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణ ప్రగతితో మున్సిపాలిటీలను అన్ని రంగాలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక ద్వారా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో పర్యటించి పెట్టుబడులను పెద్ద ఎత్తున తీసుకురావడానికి కృషి చేస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నాగిరెడ్డి గూడ ఉప సర్పంచ్ ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే వారికి శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు దేశానికే ఆదర్శంగా నిలిచేందుకు సిఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం

జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసంబర్ 19: పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక గొప్ప వరంగా మారిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవరయాంజాల్ చెందిన సుతారిగూడెం జగన్ మోహన్ కు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.60 వేల రూపాయల చెక్కును జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి శుక్రవారం లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఎవరైనా అనారోగ్యం బారిన పడినప్పుడు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి తనకు చెక్కును మంజూరు చేసినందుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, భీమిడి జైపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్ పేండం లక్ష్మి నారాయణ, దేవస్థానం ధర్మకర్తలు వలందాసు మురళి గౌడ్, గుడిసేని హరికృష్ణ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పేండం సాయి మనీష్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీలలో జగన్ మాస్టర్ విజయం

మడికట్టు గ్రామానికి గర్వకారణం

ప్రతిపక్షం, చేవెళ్ల, డిసెంబర్19: చేవెళ్ల మండల పరిధిలోని శుక్రవారం మడికట్టు గ్రామానికి చెందిన ధర్మసాగర్ జగన్ రవీంద్ర భారతి డాన్స్ అకాడమీ నిర్వహించిన పోటీలలో మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువకుడు.ఆర్థిక వనరులు లేకపోయినా, చిన్నప్పటి నుంచే డాన్స్‌పై ఆసక్తిని కనబడుచాడు డాన్స్ మాస్టర్ కావాలనే ఆసక్తితో నిరంతరం కష్టపడి కృషి చేసిన జగన్ తన కల సాకారమైంది.హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మకంగా రవీంద్ర భారతి డాన్స్ అకాడమీ నిర్వహించిన పోటీలలో మొత్తం 10 గ్రూపులపై పోటీ పడి జగన్ మాస్టర్ తన ఆధ్వర్యంలోని 45 మంది చిన్నారుల బృందంతో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ఘన విజయంసాధించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన తంగడపల్లి మడికట్టు గ్రామ సర్పంచ్ పామేనా రాములు జగన్ మాస్టర్‌ను శాలువతో సత్కరించి అభినందించారు. మధ్యతరగతి నుంచి వచ్చి కష్టపడి తన లక్ష్యాన్ని చేరుకున్న జగన్ మాస్టర్ విజయం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గ్రామస్తులు, శ్రేయోభిలాషులు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఈ కార్యక్రమంలో గోవర్ధన్, కంకంటి మల్లేష్ రామస్వామి బల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి న్యాలట అశోక్ జె శ్రీనివాస్ రెడ్డి భూపాల్ గణేష్ యాదగిరి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామానికి బస్సు ఏర్పాటు చేయండి

ప్రతిపక్షం, చేవెళ్ల, డిసెంబర్19 : చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం దుద్దాగు గ్రామ పంచాయతీ నూతనంగా గెలుపొందిన సర్పంచ్ లక్ష్మి ప్రసన్న శేఖర్,శుక్రవారం వికారాబాద్ డిపో డిప్యూటీ మేనేజర్ పిఎన్ నమృతని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. తమ గ్రామ ప్రజలు విద్యార్థులు బస్సు లేక పోవడంతో సరైన టైమ్ కి చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని, ఈ మేరకు నూతన బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా బస్సు ఏర్పాటు వేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, వార్డ్ నెంబర్లు పాల్గొన్నారు.

కేసీఆర్ నగర్‌లో విషాదం

- ఎనిమిదో అంతస్తు నుండి జారిపడి యువతి మృతి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 19 : హైదరాబాద్ లో ఒకే ప్రైవేట్ కంపెనీలో పనిచేసే సహోద్యోగుల మధ్య పరిచయం ఒక యువతి ప్రాణాలను బలితీసుకున్న విషాద సంఘటన కేసీఆర్ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మృతురాలు సకిన ఫాతిమా, నిందితుడు హుస్సేనాలి ఇద్దరూ ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ ఒకరికొకరు పరిచయస్తులు. ఫాతిమా కుటుంబానికి కేసీఆర్ నగర్‌లోని బ్లాక్ నంబర్ 40 లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించబడింది. గురువారం ఫాతిమా మరియు హుస్సేన్ అలి కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కి వచ్చారు. అదే సమయంలో ఫాతిమా తండ్రి రావడం తో, తండ్రి గొంతు విన్న ఫాతిమా భయంతో, తండ్రికి దొరికిపోతామనే ఆందోళనతో, ఆమె బాల్కనీ గుండా పక్క ఫ్లాట్ లోకి వెళ్లడానికి హుస్సేన్ అలి సహకారంతో ప్రయత్నించింది. ఈ క్రమంలో పట్టుతప్పి ఎనిమిదో అంతస్తు నుండి కిందకి జారీ పడిపోయింది. తీవ్ర గాయాలవ్వడంతో ఫాతిమా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిందని కొల్లూర్ పోలీసులు తెలిపారు.

బడుగుల లీడర్ కొర్వి కృష్ణ స్వామి

- నీలం మధు ముదిరాజ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 19 : కొరవి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి పురస్కరించుకొని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన నీలం మధు ముదిరాజ్. హైదరాబాద్ నగర మేయర్ గా పని చేసి ఆయన ముందుచూపుతో చేసిన నగర మాస్టర్ ప్లాన్ చిరస్థాయిగా నిలిచిపోయింది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుల ముద్దుబిడ్డ మహానేత కొర్వి కృష్ణస్వామి అని, ఆయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, పాత్రికేయుడు, విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశీలి అని ఆయన బహుజనుల పక్షాన ఉండి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. ఆ మహానేత ఆశయాలను ఆయన స్ఫూర్తితో మనమంతా కలిసి ముందుకు తీసుకెళ్దాం అని పిలుపునిచ్చారు.

రంగుల అన్వేషణలో ప్రతిభా ప్రదర్శన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 19 : జీఎస్‌హెచ్ఎస్ లోని లలిత కళల విభాగం ఆధ్వర్యంలో రంగు అధ్యయన కోర్సు ఫలితాలను ప్రదర్శించే ప్రదర్శనను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఇందులో రంగు సిద్ధాంతం, దాని వ్యక్తీకరణ వినియోగాల యొక్క లోతైన విశ్లేషణను ప్రతిబింబించేలా విద్యార్థులు కళాకృతులను ప్రదర్శించారు. రంగుల ప్రాథమిక అంశాలు, రంగు ప్రణాళిక, దృశ్య సంభాషణలో వాటి పాత్ర యొక్క సమగ్ర అధ్యయనం ద్వారా అభివృద్ధి చేసిన వాటిని ప్రదర్శించారు. పాఠ్యాంశాలలో భాగంగా, విద్యార్థులు లియోనార్డో డా విన్సీ, పాబ్లో పికాసో, విన్సెంట్ వాన్ గోహ్, సాల్వడార్ డాలీ, రాజా రవివర్మ, జామిని రాయ్ వంటి ప్రముఖ కళాకారులచే ప్రేరణ పొందిన మాస్టర్ కలర్ స్కీములను విశ్లేషించి సాధన చేశారు. ఈ కోర్సు చరిత్ర పూర్వం నుంచి వర్తమాన కాలం వరకు కళాత్మక సంప్రదాయాలను ప్రతిబింబించడమే గాక, భారతీయ, పాశ్చాత్య కళా ధోరణులను కలిగి ఉంది. ఇవన్నీ రంగుల వినియోగంపై విస్తృత చారిత్రక, సమకాలీన దృక్పథాన్ని విద్యార్థులకు అందించాయి. లలిత కళల విభాగం ఆచార్యుడు డాక్టర్ ఆదిశేషయ్య సాడే మార్గదర్శనంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ప్రారంభించారు. జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శామ్యూల్ థరూర్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, కోర్సు సమన్వయకర్త డాక్టర్ లలిత సింధూరి తదితరులు విద్యార్థుల సృజనాత్మకత, కళాకృతులలో ప్రదర్శించిన విద్యాపరమైన నైపుణ్యాలను అభినందించారు.రంగును శక్తివంతమైన దృశ్య భాషగా విద్యార్థులు అర్థం చేసుకున్నందుకు, నిర్మాణాత్మక కళా విద్య యొక్క ప్రభావానికి ఈ ప్రదర్శన నిదర్శనంగా నిలిచింది.

ఉరి వేసుకుని జార్ఖండ్ యువకుడు మృతి

ప్రతిపక్షం, చిట్యాల, డిసెంబర్ 19: తను ప్రేమించిన యువతి దూరమవుతోందనే ఉద్దేశంతో కలత చెంది బ్లాంకెట్ తో ఉరివేసుకొని జార్ఖండ్ యువకుడు మృతి చెందిన ఘటన చిట్యాల మండలంలో జరిగింది. ఏఎస్ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు పరిధిలోని దశమి ల్యాబ్స్ లో సుధీర్ ఓర్వాన్ (22) లేబర్ క్వార్టర్స్ లో ఉంటున్నాడు. ప్రక్క గ్రామానికి చెందిన ప్రేమించిన యువతి దూరం అవుతుందని, మరొకచోట పనిచేయడం ఇష్టం లేక గురువారం సాయంత్రం కలత చెంది క్వార్టర్ సమీపంలో ఖాళీ ప్రదేశంలో బ్లాంకెట్ తో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నేరడగాదిరెడ్డిపల్లి బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి

- 3 కి.మీ 8 కి. మీ తిరగాలా?
- మంత్రులు స్పందించాలి
- బీజేపీ నేత కాసోజు ఆవేదన

ప్రతిపక్షం, చిట్యాల, డిసెంబర్ 19: నేరడగాదిరెడ్డిపల్లి బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని నేరడ కు చెందిన బీజేపీ జిల్లా నాయకులు కాసోజు శంకరాచారి డిమాండ్ చేశారు. ఎస్ఎల్బీసీ కాలువనుఇష్టారీతిన తవ్వేసి.. రైతులను ఇక్కట్లకు గురి చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రైతులతో కలిసి ఆయన కాలువను పరిశీలించారు. 3 కిలోమీటర్ల కోసం 8 కిలోమీటర్లు తిరగాల్సి వస్తుందని ఆవేదన చెందారు. నేరడ, గాదిరెడ్డి పల్లి గ్రామాలతో పాటు హైవేకు రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా మంత్రులు ఇక్కడి రైతుల బాధలను పట్టించుకోవాలని అన్నారు. వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు దుబ్బాక వెంకటరెడ్డి, గంజి కృష్ణయ్య, సత్తయ్య, పిల్లలమర్రి రమేష్, ఆవుల శ్రీనివాస్ రమేష్, నరేష్ పాల్గొన్నారు.



నదీ వారసత్వాన్ని అధ్యయనం చేద్దాం

- మూసీ నది, హైదరాబాదు పరిణామ క్రమంపై గీతంలో ప్రదర్శన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 19 : హైదరాబాదు నదీ వారసత్వాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం కోసం 'మూసీ నది, హైదరాబాదు పరిణామం'పై శుక్రవారం హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఒక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. దక్కన్ ఆర్కైవ్స్ సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) దీనిని నిర్వహించింది. చారిత్రక పత్రాలు, ఛాయాచిత్రాలు, మ్యాపులు, దృష్టాంతాలతో సహా అరుదైన ఆర్కైవల్ మెటీరియళ్లను ఆలోచనాత్మకంగా సేకరించి, ప్రదర్శించారు. ఈ ప్రదర్శన సందర్శకులకు మూసీ నదితో హైదరాబాదు యొక్క దీర్ఘకాలిక, సంక్లిష్టమైన సంబంధం యొక్క ఆకర్షణీయమైన కథనాన్ని అందించాయి. దృశ్య, పాఠ్య రికార్డుల ద్వారా, 20వ శతాబ్దం ప్రారంభంలో వినాశకరమైన వరదల నుంచి జలాశయాల అభివృద్ధి, హైదరాబాదు యొక్క మౌలిక సదుపాయాలు, ల్యాండ్ స్కేపు (ప్రకృతి దృశ్యాన్ని) పునర్నిర్మించిన పట్టణ ప్రణాళికల వరకు, నగరం యొక్క పరివర్తనను ఈ ప్రదర్శనలో చూపారు. పర్యావరణ సవాళ్లు పౌర ప్రతిస్పందనలను, దీర్ఘకాలిక పట్టణ పరిణామాన్ని ఎలా ప్రభావితం చేశాయో ఈ ప్రదర్శనలో ప్రముఖంగా చూపారు. పర్యావరణ స్థితిస్థాపకత, పట్టణాభివృద్ధి, చారిత్రక జ్ఞాపకాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత వంటి కీలక అంశాలను ఈ కార్యక్రమం నొక్కి చెప్పింది. చరిత్రకారులు, ఆర్కైవిస్టులు, పరిశోధకులు, విద్యార్థులను ఒకచోట చేర్చి హైదరాబాదు నదీ వారసత్వాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడానికి తోడ్పడింది. ఈ ప్రదర్శనకు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, చరిత్ర ఔత్సాహికులు హాజరయ్యారు. నగరం యొక్క గతాన్ని అర్థం చేసుకోవడానికి, హైదరాబాదు గుర్తింపును రూపొందించడంలో మూసీ నది యొక్క శాశ్వత ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి తోడ్పడినట్టు వారు అభిప్రాయపడ్డారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుపై తిరగబడ్డ ప్రజలు

ప్రజాపక్షం హనుమకొండ, డిసెంబర్19 : వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 14వ డివిజన్‌లో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును స్థానిక ప్రజలు తీవ్రంగా నిలదీశారు. డివిజన్‌లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, అభివృద్ధి లోపాలపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సమస్యలు ఎన్నాళ్లుగా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ఎమ్మెల్యే నుంచి స్పష్టమైన సమాధానాలు రాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైంది. స్థానికుల ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేకపోయిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ ఘటనతో డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీపై ప్రజల ఆగ్రహం స్పష్టంగా కనిపించింది.

ఏటా 4వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది. వరద జలాలపై హక్కు కింది రాష్ట్రంగా ఏపీకే ఉంటుంది. పోలవరంపై 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలి. కెనాల్‌ల సామర్థ్యం 17వేల క్యూసెక్కులకు పెంచి ఆ అదనపు వ్యయాన్ని ప్రాజెక్టు ఖర్చులో చేర్చాలి. గోదావరి జలాలపై ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి.

- ఏపీ మంత్రి రామానాయుడు

ప్రాంతీయం

కాంగ్రెస్ లోకి భారీ చేరికలు

- పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యం
- మంత్రి వివేక్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 19: సిద్ధిపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి భారీగా చేరికలు జరిగాయి. సిద్ధిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కృష్ణమూర్తి తనతో పాటు దాదాపు 200 మంది అనుచరులతో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సిద్ధిపేటపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సిద్ధిపేట నియోజకవర్గ అభివృద్ధిపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో చర్చలు జరిపినట్లు చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ, ప్రతి గడపకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించినట్లు మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ప్రభావాన్ని తగ్గించి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన అన్నారు.

ఎన్నికల్లో పతనం అంచులో ఉన్న వారికి పునర్జీవం పోసిన పురాణం

- కోటపల్లిలో 25 పంచాయతీల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు

ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి

మంచిర్యాలజిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో ఇటీవల జరిగినగ్రామ పంచాయతీ ఎన్నికల్లో పతనం అంచుల్లో ఉన్న వారికి మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ పునర్జీవం పోశాడు.కోటపల్లి మండలంలో 25 మంది కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడం వెనుక పురాణం సతీష్‌ప్రభావం ఉందని చెప్పవచ్చు. ఈ నియోజకవర్గంలో 38 మందిఇండిపెండెంట్లు గెలవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ నుంచి చాలా మంది ఆశావహులు రెబల్‌గా బరిలో దిగారు. దీంతో కొంత పార్టీ నష్టపోయింది. ఇండిపెండెంట్లు గా గెలిచిన సర్పంచ్‌లు అంతా కూడ కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర కార్మికమంత్రిచెన్నూర్ అభివృద్ధికి చేస్తున్నకృషితో పాటు పంచాయతీకి పెద్ద ఎత్తున నిధులు రావడంలో పార్టీలో చేరేందుకు ఇండిపెండెంట్ల సర్పంచ్‌లు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సర్పంచ్ ఎన్నికల విషయానికి వస్తే మొదట పురాణం సతీష్‌సతీమణి కూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్తిగా బరిలో దిగగా మంత్రి వివేక్ ఆదేశాల మేరకువిరమించుకొని పార్టీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు పలికారు.మాజీ ఎమ్మెల్సీకి మండలంలో మంచిప ట్టు ఉండడం పంచాయతీ ఎన్నికల్లోకలిసి వచ్చింది. పార్టీ బలపరిచిన గెలుపుకు ప్రధానమైనదని చెప్పవచ్చు. మంత్రి ఆలోచన విధానం కూడ సర్పంచ్ ఎన్నికలకు కలసివచ్చింది. ఏదేమైన కాంగ్రెస్ నుంచి పోటి చేసేందుకు ఆశావహులు అధికంగా ఉండడం తలనొప్పి అయింది. రెబల్స్ అధికశాతం కూడ గెలువడం వారు కూడ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కొంత ఊరటనిచ్చింది. చెన్నూర్‌లోని కిష్టంపేటలో ఏడుగురు బరిలో దిగడం చర్చనీయాంశమైంది.వందకు వందశాతం గెలిచే అవకాశం పంచాయతీల్లో రెబల్స్‌తో చేయిదాటిపోయింది. ఏదేమైన పంచాయతీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకొని మంత్రి వివేక్ ఎంపీటీసీ, జడ్‌పీటీసీ, మున్సిపాలిటిపై కొంతఫోకస్ పెట్టారు. ఇప్పటి నుంచే పార్టీకి కొంతదూరంగా ఉంటున్నటువంటి వారిని కూడ మంత్రి వారిని పార్టీకి పని చేసేలా కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలుస్తుంది.

బస్తీ దవాఖానల్లో డాక్టర్లు లేరు

- హరీష్ రావు ఆగ్రహం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 19: సిద్ధిపేట పట్టణంలోని బస్తీ దవాఖానాల పరిస్థితిపై మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న బస్తీ దవాఖానను ఆయన ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా దవాఖానలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్ధిపేట పట్టణంలో నాలుగు బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం కేసీఆర్ నగర్ దవాఖాన తప్ప మిగతా మూడు బస్తీ దవాఖానల్లో (కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డి పల్లి, ఆర్ అండ్ బి సమీపంలో) గత ఆరు నెలలుగా డాక్టర్లు లేరని సిబ్బంది తెలిపారు.డాక్టర్లు లేకపోవడంతో మెడికల్ ఆఫీసర్ రూమ్‌లో పెచ్చులు ఊడిపోవడం, డాక్టర్ కూర్చునే కుర్చీపై దుమ్ము పట్టి ఉండటాన్ని గమనించిన హరీష్ రావు , డాక్టర్లు లేకుండా ప్రజలకు వైద్య సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. అత్యవసరమైన మందులుకూడా అందుబాటులో లేవని వెల్లడించారు. అటెండర్లకు మూడు నెలలుగా జీతాలు రాకపోగా, స్టాఫ్ నర్స్‌కు నవంబర్ నెల జీతం ఇంకా రాలేదని తెలిపారు. డాక్టర్లు లేరు, మందులు లేవు, జీతాలు ఇవ్వడం లేదని, ఈ పరిస్థితుల్లో ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించిన ఆయన, ప్రజా వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బస్తీ దవాఖానల్లో డాక్టర్లను నియమించి, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా అశోక్ రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 19: మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు డిసిసి అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి ఆదేశాల మేరకు గజ్వేల్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి ఎన్నికైనారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోని సమస్యలను ఎత్తిచూపుతూ వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా తూమ్ అమరేందర్ పటేల్ ఎన్నిక కాగా వారిని నర్సారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పాల్గొన్నారు.

క్రీడా పోటీతత్వం ఆత్మవిశ్వాసంలో శిక్షణ

- ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హమ్దాన్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్19 : స్పోర్ట్స్ మీట్ అనేది క్రీడలు, వ్యక్తిత్వ నిర్మాణం, జట్టుకృషిమరియు ఆత్మవిశ్వాసంలో శిక్షణ అని తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్ అన్నారు. శుక్రవారం టిమ్రేజ్ స్కూల్స్, జోష్ 2025, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలు, జూనియర్ కాలేజ్ బాయ్స్ మూడు రోజుల క్రీడా పోటీలను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన ఆహారం, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలలో ఆధునిక సౌకర్యాలతో పాటు క్రీడా రంగంపై దృష్టి సారించిందన్నారు. తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా క్రీడా రంగంలో మెరుగ్గా రాణించగలరని అన్నారు. నిజామాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి రవి కుమార్ మాట్లాడుతూ క్రీడలు విద్యలో ఒక భాగమని అన్నారు. ప్రతి విద్యార్థి తన కళను తన సామర్థ్యం మేరకు ప్రదర్శించాలని ప్రోత్సహించారు.

ఈశ్వర చారి మృతికి నిరసనగా కొవ్వు వత్తుల ర్యాలీ



ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 19: ఈశ్వర చారి రిజర్వేషన్ ప్రభుత్వాలు కల్పించలేదని దిగులుతో ఆత్మబలిదానం చేసుకోవడం జరిగిందని అందుకు నిరసనగా విద్యార్థి జేఏసీ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి విద్యార్థి జేఏసీ క్రోవత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణములో వివేకానందుని విగ్రహం నుండి కొవ్వొత్తుల ర్యాలీ బయల్దేరి ఐబి కి చేరుకున్నది. ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి బీసీ జేఏసీ విద్యార్థి జేఏసీ నాయకులు బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు సల్మాన్ ఖాన్ నితీష్ లు బిసి ఉద్యమకారులు డాక్టర్ నీలకంఠేశ్వర గౌడ్ మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పల్లె భూమేష్‌తులా మధుసూదన్‌లు మాట్లాడుతూ ఎన్నికలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులస్తులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మాట మార్చడం జరిగిందన్నారు ఇచ్చిన హామీలను మరవడంతో బిసి నాయకులలో విద్యార్థులలో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. అందుకోసమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా సాయి ఈశ్వర చారి ఆత్మబలిదానం చేసుకోవడం జరిగిందన్నారు ఇక ఆత్మబలిదానాలు చేసుకోకూడదని పోరాటాల తోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి సాధించుకోవాలని తెలిపారు ఎవరు క్షణికావేశంలో తమ ప్రాణాలకు ముప్పు తీసుకోకూడదని అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బీసీ కురస్తులకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వ పై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు నాయకులు బిసి అభిమానులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి అండగా హరీష్ రావు

- పీజీ వైద్యవిద్య కోసం స్వగృహాన్ని మార్టిగేజ్ చేసిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట. డిసెంబర్ 19: పేదరికం కారణంగా పీజీ వైద్య సీటు కోల్పోయే ప్రమాదంలో ఉన్న ఓ నిరుపేద విద్యార్థినికి మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అండగా నిలిచారు. బ్యాంకు రుణం కోసం ఏకంగా తన స్వగృహాన్ని మార్టిగేజ్ చేసి విద్యార్థినికి ఎడ్యుకేషన్ లోన్ మంజూరు చేయించి తన మానవతా ఔదార్యాన్ని మరోసారి చాటుకున్నారు.సిద్ధిపేటకు చెందిన టైలర్ కొంక రామచంద్రం కుమార్తె మమత విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఉచితంగా ఎంబీబీఎస్ పూర్తి చేసి, తాజాగా మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ మెడికల్ కాలేజీలో ఆప్తమాలజీ విభాగంలో పీజీ సీటు సాధించింది. ప్రభుత్వ కన్వీనర్ కోటాలో సీటు వచ్చినప్పటికీ, మూడేళ్ల పాటు ప్రతి సంవత్సరం రూ.7.50 లక్షల చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి రావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈనెల 18వ తేదీలోగా ఫీజు చెల్లించకపోతే సీటు రద్దయ్యే పరిస్థితి నెలకొంది. ఎడ్యుకేషన్ లోన్ కోసం బ్యాంకును ఆశ్రయించగా, ఆస్తి మార్టిగేజ్ చేయాలని బ్యాంకు అధికారులు సూచించారు. ఎలాంటి స్థిరాస్తులు లేని రామచంద్రం పరిస్థితి తెలుసుకున్న హరీష్ రావు వెంటనే స్పందించి, సిద్దిపేటలోని తన ఇంటిని మార్టిగేజ్ చేసి దాదాపు రూ.20 లక్షల ఎడ్యుకేషన్ లోన్ మంజూరు అయ్యేలా చొరవ చూపారు. దీంతో మమత ట్యూషన్ ఫీజు చెల్లించి పీజీ సీటును నిలుపుకుంది. మొదటి సంవత్సరం హాస్టల్ ఫీజు రూ.లక్ష అవుతుందని తెలిసిన వెంటనే, మరో అప్పు చేయొద్దని సూచిస్తూ ఆ మొత్తాన్ని కూడా హరీష్‌రావు అందించారు.

కాంగ్రెస్ పార్టీలోకి

దేవేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 19: బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి భర్త దేవేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు చింతల నరసింహులు శుక్రవారం రాష్ట కాంగ్రెస్ నాయకుడు మెదక్ మాజీ ఎమ్మెల్యేమైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేవేందర్ రెడ్డి కి చింతల నరసింహులుకు ఉన్న భూతగాదాలే చింతల నరసింహులు కాంగ్రెస్ వైపుకు వెళ్లాడని, మొన్నటి వరకు దేవేందర్ రెడ్డి బినామీగా వ్యవహరించి, పట్టణ రాజకీయాలలో తను చెప్పిందే వేదంగా భావించిన చింతల నర్సింలు గత మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి హయాంలో తను చెప్పిందే వేదంగా పార్టీని నడిపించిన నరసింహులు కాంగ్రెస్ పార్టీ లో చేరడం గమనార్హం

మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లోకి సర్పంచులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్19: గ్రామపంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో శుక్రవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. హవేలీ ఘన్పూర్ మండలం జక్కన్నపేట గ్రామ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, పోచమ్మరల్ గ్రామ సర్పంచ్ రాజు, వార్డ్ మెంబర్లు, ఉపసర్పంచ్ మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానని వారు తెలిపారు.

కుల మతాలకతీతంగా మానవత్వంతో పనిచేద్దాం

- గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 19: అన్ని మతాలు, కులాల సారాంశం ఒక్కటేనని దేవుని పట్ల దైవభక్తి ప్రేమ, కరుణ,ఆదరణ, ఆప్యాయత, అనురాగాలతో, ఒకరికొకరు కలిసి మెలిసి ఐకమత్యంతో ఉండడం కోసం మనం చేసే విధి నిర్వహణలో క్రమశిక్షణతో నిర్వర్తించినట్టయితే దేవుడు మనకు అన్ని విధాలుగా ఆదుకుంటాడని గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. జరగబోయే క్రిస్మస్ సంబరాలను శుక్రవారం నాడు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్డెంట్ మాట్లాడుతూ ధ్యానంతో దైవ సన్నిధిలో ఉన్నట్టయితే ఆరోగ్యంగా ఎక్కువ కాలం జీవించవచ్చునన్నారు. వివిధ మతాలు కులాలు మనం సృష్టించుకున్నవే కాబట్టి మానవ జన్మ ఎత్తినందుకు సేవా దృక్పథంతో నీతి, నిజాయితీతో ఒకరినొకరు గౌరవించుకుంటూ, దైవ భక్తి మార్గంలో కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ రాము, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీత, డాక్టర్ త్రివేణి, నర్సింగ్ సూపరిండెంట్ స్వరూప రాణి, సువర్ణ, నర్సింగ్, ఆఫీసర్లు ఉమామహేశ్వరి, ఉజ్మ కాతున్, వకులాదేవి, మేరీ పుష్ప, వీణ, యాదమ్మ ,విజయ కుమారి, రోజులిన్, పోచమని, ఫార్మసీ ఆఫీసర్స్ హెప్సిబా, శశికళ, ఉమా, విమల, శ్రీనివాస చారి, మోహన్, దయాలసిస్ గణేష్, మధు, సాయి. రమేష్‌ల్యాబ్ టెక్నీషియన్ జీవన,వాసుదేవ్ హెల్త్ అసిస్టెంట్ మరియు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

హోదా మరిచి ముఖ్యమంత్రి మాటలు సరికావు

- నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 19: గ్రామపంచాయతీ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో విజయం సాధించిన అభ్యర్థులను లెక్కించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడాలని నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటే ప్రతాపరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా స్థానాలను గెలిచిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదమని అన్నారు.గెలిచిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులను సెక్రటేరియట్‌కు లేదా రేవంత్ రెడ్డి ఇంటికి తీసుకువస్తామని మీరు వారిని లెక్క పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. హుందాంగా మాట్లాడింది పోయి స్థాయిని మరిచి అబద్ధాలు అసత్యాలు మాట్లాడుతున్నారని ప్రతాపరెడ్డి మండిపడ్డారు. గజ్వేల్ నియోజకవర్గం లో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో 179 స్థానాలకు గాను బిఆర్ఎస్ పార్టీ 92 స్థానాలను గెలిచిందని, కాంగ్రెస్ పార్టీ 68 , బిజెపి 5, ఇతరులకు 14 స్థానాలు వచ్చాయని తెలిపారు. ఇది తెలియక రేవంత్ రెడ్డి గజ్వేల్ లీడర్ల మోసపూరితమైన అబద్ధాలు నమ్మి మీడియా ముఖంగా మాట్లాడడం చాలా విడ్డూరం అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం లోని మండల కేంద్రాలైన ములుగు, వర్గల్, జగదేపూర్, అహ్మదీపూర్, కుకునూరు పల్లి, దుద్దెడ లాంటి మేజర్ గ్రామపంచాయతీలలో గులాబీ జెండా ఎగిరింది అన్నారు. రెబల్ తో 25 పైగా స్థానాలు బిఆర్ఎస్ నష్టపోయిందని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ స్థానిక నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పు పొందటానికి గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలలో 50 శాతం ఓట్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి రాలేదని తెలిపారు. సమావేశంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్ సి రాజమౌళి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాస శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి అనంతుల ప్రశాంత్, రామచంద్రం, కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, బిఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, నాయకులు మద్ది రాజిరెడ్డి, హైదర్ పటేల్, ఆకుల దేవేందర్, రఘుపతి రెడ్డి, పాల రమేష్‌గౌడ్, ఉమర్, అహ్మద్, ఎల్లం తదితరులున్నారు.

“

భారత జట్టులో చోటు కోల్పోయినప్పుడు చాలా బాధగా అనిపించింది. బాగా పర్ఫార్మ్ చేసినా నేషనల్ టీమ్‌కు నన్ను సెలక్ట్ చేయలేదు. దీంతో ఇంకా గొప్పగా రాణించాలని అర్థమైంది. నా టీమ్‌ను గెలిపించాలి. ఒక యూనిట్‌గా బాగా ఆడాలని అనుకున్నా. టీమ్‌లో పేరు లేదని బాధపడే జోన్‌లో ప్రస్తుతం నేను లేను. ఎక్స్‌పెక్టేషన్ లేకుండా బాగా ఆడటమే నా పని.

-క్రికెటర్ ఇషాన్ కిషన్

నిరసనల మధ్య ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 19: నిరసనల మధ్య గురువారం అర్ధరాత్రి వీబీజీ రామ్ జీ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. తర్వాత శుక్రవారం కూడా ఈ బిల్లు విషయమై విపక్షాలు నిరసన వ్యక్తం చేయడంతో ఉభయ సభలు ప్రారంభమైన కాసేపటికే వాయిదా పడ్డాయి. ఆ తర్వాత శీతాకాల సమావేశాలను ముగిస్తున్నట్టు లోక్‌సభ, రాజ్యసభ సభాధిపతులు ప్రకటించారు. అంతకు ముందు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో వీబీజీ రామ్ జీ బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు గురువారం రాత్రి పార్లమెంట్ కాంప్లెక్స్‌లో 12 గంటల ధర్నా నిర్వహించారు. ప్రతిపక్షాల అభ్యంతరాలను తోసి పుచ్చి కేంద్ర ప్రభుత్వం వీబీజీ రామ్ జీ బిల్లును ఏకపక్షంగా ఆమోదించిందని టీఎంసీ రాజ్యసభ ఉప నాయకురాలు సాగరికా ఘోష్ ఆరోపించారు. ప్రతిపక్షాల నిరసనల మధ్య వీబీజీ రామ్ జీ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఈ సమావేశాలు 19 రోజులపాటు 92 గంటల 25 నిమిషాలపాటు జరిగాయి. లోక్‌సభ శుక్రవారం సమావేశం కాగానే సభాపతి ఓం బిర్లా మాట్లాడుతూ, ఈ సెషన్‌లో లోక్ సభ ఉత్పాదకత 111 శాతంగా నమోదైనట్లు తెలిపారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఈ సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలోనే ఉన్నారు. కొందరు సభ్యులు 'మహాత్మా గాంధీ కీ జై' అంటూ నినాదాలు చేశారు. 150 ఏండ్ల చరిత్ర కలిగిన జాతీయ గేయం 'వందేమాతరం', ఎన్నికల సంస్కరణలపైనా ఈ సమావేశాల్లో చర్చలు జరిగాయి. వాయు కాలుష్యంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా చర్చ ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ, ఈ చర్చ జరగలేదు. 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టినప్పటికీ, ఎన్నికల కమిషన్, దాని కార్యకలాపాలపై సభలో చర్చించజాలమని ప్రభుత్వం చెప్పింది. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రతిపక్ష సభ్యుల తీరును తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రవర్తన పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు. ఈసారి రాజ్యసభ కార్యకలాపాలు 92 గంటలపాటు జరిగాయని, 121 శాతం ఉత్పాదతకత నమోదైందని వివరించారు. తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేశారు.

విశ్వ వీక్షణం

బంగ్లాదేశ్‌లో మళ్లీ విధ్వంసం

- తిరుగుబాటు నాయకుడు హాది మృతితో కలకలం
- దేశంలోని పలు చోట్ల అల్లర్లు
- జాగ్రత్తగా ఉండాలని స్థానిక భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ

ఢాకా, డిసెంబర్ 19: బంగ్లాదేశ్ మరోసారి భగ్గుమంది. ఇటీవల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి, తిరుగుబాటు నాయకుడు, భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు చేసే షరీఫ్ ఉస్మాన్ హాది మరణించడంతో ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు గురు, శుక్రవారాల్లో దేశంలో పలుచోట్ల నిరసనలు చేపట్టడంతో హింస, విధ్వంసం చోటు చేసుకుంది. అల్లర్లలో ఒక హిందువు హత్యకు గురి కాగా, పలువురు నిరసనకారులు, పౌరులు గాయపడ్డారు. ఢాకాలో బంగ్లాదేశ్ వ్యవస్థాపక పితామహుడు షేక్ ముజిబుర్ రెహమాన్ గృహమైన 32 ధన్‌మండీ భవనాన్ని ఆందోళనకారులు కూల్చివేశారు. రాత్రి నిరసనకారులు రాజాషాహీలోని అవామీ లీగ్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. రెండు మీడియా సంస్థలకు నిప్పు పెట్టారు. జతియా ఛత్ర శక్తి విద్యార్థి సంఘం యూనివర్సిటీ క్యాంపస్‌లో సంతాప ప్రదర్శన చేసిన అనంతరం షాన్‌బాగ్ కూడలికి చేరుకుని ఆందోళనలో పాల్గొంది. చిట్టగాంగ్‌లోని భారత సహాయ ఇండియన్ హై కమిషనర్ నివాస గృహంపై రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వారిపై లాఠీచార్జి చేయడమే కాక, టియర్ గ్యాస్ ప్రయోగించారు. అలాగే రెండు పత్రికా కార్యాలయాలకు సిబ్బందిని నిర్బంధించారు. దీంతో బంగ్లాదేశ్‌లోని భారత హై కమిషన్ అడ్వైజరీ జారీ చేసింది. భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఉస్మాన్ హాది మరణాన్ని బంగ్లాదేశ్ తాత్కాలిక అధ్యక్షుడు యూనిస్ గురువారం రాత్రి నిర్ధారించారు. మెమెన్సింగ్ జిల్లాలో ఒక హిందువును గురువారం రాత్రి కొందరు దుండగులు సజీవ దహనం చేశారు. భలుకా ఉపాజిలా పరిధిలోని దుబాలియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీపూ అనే వ్యక్తి ఓ ప్రవక్తను దూషించాడని ఆరోపిస్తూ దాడి చేసిన మూక అతడిని ఒక చెట్టుకు కట్టేసి చిత్ర హింస పెట్టి చంపింది. అనంతరం అతడి మృతదేహానికి నిప్పంటించారు.

గ్రీన్ కార్డు లాటరీ తాత్కాలికంగా నిలిపివేత

బ్రౌన్ యూనివర్సిటీ కాల్పుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం గ్రీన్ కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీని ప్రభావం భారతీయులపై తీవ్రంగా పడింది. దేశాధ్యక్షుడి ఆదేశాల మేరకు ఈ ప్రోగ్రామ్‌ను ఆపాలని యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌ను ఆదేశించినట్లు హోం ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టి నోయెమ్ ఇచ్చిన ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. బ్రౌన్ విశ్వవిద్యాలయంలో కాల్పులు, ఎంఐటీ ప్రొఫెసర్ హత్య కేసుల్లో అనుమానితుడు పోర్చుగీస్ జాతీయుడు క్లాడియో నెవెస్ వాలెంటే ఈ ప్రోగ్రామ్ ద్వారానే అమెరికాలో ప్రవేశించాడు. నెవెస్ గురువారం మరణించి కనిపించినట్లు అధికారులు తెలిపారు. అతను తనను తాను కాల్చుకుని మరణించాడని అనుమానిస్తున్నారు. అమెరికాలో 2025 వీసా లాటరీ కోసం సుమారు 2 కోట్ల మంది దరఖాస్తు చేశారు. 1,31,000 మంది ఎంపికయ్యారు. వీరిలో లాటరీ విజేతల భార్య లేదా భర్త కూడా ఉన్నారు. లాటరీలో గెలిచిన తర్వాత వీరు క్షుణ్ణంగా తనిఖీలు చేయించుకోవాలి, ఆ తర్వాత మాత్రమే వారికి అమెరికాలోకి ప్రవేశం లభిస్తుంది.

జుట్టును కాపాడుకోండి ఇలా!



చాలా మంది జుట్టు రాలడం గురించి ఆందోళన చెందుతుంటారు. అటువంటి పరిస్థితిలో అనేక వైద్య చికిత్సల సహాయం తీసుకుంటారు. మీరు కూడా జుట్టు రాలడం వల్ల ఇబ్బంది పడుతున్నారా? మీ జుట్టును దృఢంగా చేసుకోవాలనుకుంటున్నారా? అయితే, ఈ కథనం మీకోసమే. ఈ రోజు మనం జుట్టుకు ఒక వరం అని నిరూపించే కొన్ని విషయాల గురించి మీకు తెలుసుకుందాం. జుట్టు రాలడం అనేది ఒక సాధారణ సమస్య, దీని కారణంగా చాలా మంది సతమతమవుతుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆరోగ్యకరమైన సమతుల్యమైన ఆహారం తీసుకోని జుట్టు రాలే సమస్యలను అధిగమించవచ్చు.

ఆహారంలో వీటిని తప్పకుండా తీసుకోవాలి

పప్పులు, చేపలు, కోడిగుడ్లు, చికెన్, మాంసం తదితర ప్రోటీన్లను ఆహారంలో చేర్చుకుంటే జుట్టు రాలడం తగ్గుతుంది. మీరు శాఖాహారులైతే పాలకూర, బీట్‌రూట్, అంజీర్, డ్రై ఫ్రూట్స్ వంటి వాటిని తీసుకోవచ్చు. వీటన్నింటిలో ఉండే ఐరన్ హెయిర్ ఫోలికల్స్‌కి ఆక్సిజన్ చేరడానికి సహాయపడుతుంది. ఇది కాకుండా విటమిన్ డి జుట్టుకు ఒక వరం అని కూడా భావిస్తారు. ఇది జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. మీరు విటమిన్ డి పొందడానికి చేప నూనె, గుడ్లు మరియు పాలు ఉపయోగించవచ్చు. ఇది మీ జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది మరియు మీ జుట్టును బలంగా తీర్చిదిద్దుతుంది.

అందమైన జుట్టుకు జింక్

జుట్టును అందంగా మార్చుకోవడానికి జింక్ ఎంతగానో దోహదపడుతుంది. జింక్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. దీని కోసం, గుమ్మడికాయ గింజలు, వాల్‌నట్‌లలో జింక్ పుష్కలంగా లభిస్తుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ జుట్టు ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. దీని కోసం అవిసె గింజలు, బాదం, సాల్మన్ చేపలు వంటి వాటిని తీసుకోవచ్చు. దీని వల్ల జుట్టుకు చాలాప్రయోజనాలు చేకూరుతాయి. అంతే కాదు, విటమిన్ సీ కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది, ఇది జుట్టును బలంగా మరియు అందంగా చేస్తుంది. నారింజ, నిమ్మ, స్ట్రాబెర్రీ మొదలైన విటమిన్ సికి సంబంధించిన కొన్ని పండ్లను తీసుకోవచ్చు. ఇవి కాకుండా, మీ జుట్టును క్రమం తప్పకుండా కడగాలి. కండిషన్ చేయాలి. నూనె రాసుకోవాలి. హెయిర్ మాస్క్‌ని ఉపయోగించాలి. ఇలా మన ఆహారంలో వీటిని చేర్చుకుంటే జుట్టు రాలే సమస్యను అధిగమించవచ్చు.



ఈ విషయాలను గుర్తుంచుకోండి

జుట్టును కడుక్కున్నప్పుడల్లా వేడి నీటిని ఉపయోగించకూడదని గుర్తుంచుకోండి. దీని వల్ల జుట్టు పొడిబారి నిర్జీవంగా మారుతుంది. అందువల్ల జుట్టును చల్లటి నీటితో కడగాలి. రోజంతా కనీసం 8 నుండి 10 గ్లాసుల నీరు త్రాగాలి. దీంతో జుట్టుకు పోషణ లభిస్తుంది. ఒత్తిడి కారణంగా చాలా సార్లు జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. అటువంటి పరిస్థితిలో, ఒత్తిడికి దూరంగా ఉండాలి. ప్రతిరోజూ ధ్యానం, యోగా, వ్యాయామం చేయాలి. మీ జుట్టు విపరీతంగా రాలుతున్నట్లయితే మంచి వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

మంచు.. కాలుష్యం.. ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ఉత్తరాదిని ఓ వైపు దట్టమైన పొగమంచుకు తోడు వాయు కాలుష్యం అదుపు తప్పటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాహనాలతోపాటు కాలి నడకన కూడా రోడ్లపైకి వెళ్లాలంటేనే ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని భయపడుతున్నారు. శుక్రవారం చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400పాయింట్లకు పైనే నమోదైంది. అత్యధికంగా చిల్లా సరిహద్దు ప్రాంతంలో 490 పాయింట్లు రికార్డయింది. పొగమంచు కారణంగా ఉత్తరాదిలో రోడ్డు రవాణాతోపాటు రైలు, విమానసేవలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో 16 రాష్ట్రాలకు భారత వాతావరణ విభాగం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరప్రదేశ్ మొత్తాన్ని రెడ్ అలర్ట్ జోన్‌గా గురువారం ప్రకటించింది. రెడ్ అలర్ట్ జోన్ పరిధిలో పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరాఖండ్, బిహార్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్ తదితర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. మరికొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మరోవైపు పశ్చిమ మధ్యప్రదేశ్‌లో తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. కేరళ, తమిళనాడు, అండమాన్, నికోబార్ దీవుల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నట్లు ఐఎండీ గురువారం వెల్లడించింది.

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చత్తీస్‌గఢ్, డిసెంబర్ 19: చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్‌లో సెక్యూర్టీ సిబ్బంది, నక్సలైట్ల మధ్య శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. బైరాంఘర్‌ఇంద్రావతి అడవి కొండల్లో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. నక్సలైట్ ఆపరేషన్ కోసం జిల్లా రిజర్వ్ గార్డు బృందం బయటకు వెళ్లిన సమయంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతంలో మావోలు తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో సెక్యూర్టీ బలగాలు అక్కడకు వెళ్లాయి. సుక్మా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సల్స్ హతమయ్యారు. ఆ ముగ్గురిపై 12 లక్షల రివార్డు ఉన్నది.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

గిల్‌ను తప్పించేస్తారా..?

- ఇషాన్ కిషన్‌ఆ స్థానాన్ని భర్తీ చేస్తాడా?

వచ్చే టీ20 ప్రపంచకప్ కోసం భారత స్క్వాడ్ ఎంపిక ఆసక్తి రేపుతోంది. ప్రపంచకప్ బృందంలో ఎవరు ఉంటారు? ఎవరిపై వేటు పడనుంది? అని చర్చ జోరుగా సాగుతోంది. ముఖ్యంగా.. ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్ ను తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్న వేళ నేనున్నానని భరోసానిస్తున్నాడు ఇషాన్ కిషన్. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్లో 45 బంతుల్లోనే సెంచరీతో గర్జించిన ఈ చిచ్చరపిడుగు.. ప్రపంచకప్ స్క్వాడ్‌కు గట్టిపోటీ ఇస్తున్నాడు. దాంతో.. గిల్‌ను పక్కన పెట్టేసి ఇషాన్‌కు అవకాశమిస్తారా? అనేది ఇప్పుడు అభిమానులందరి మెదళ్లలో తిరుగుతున్న ప్రశ్న. ఇంగ్లండ్ పర్యటనతో టెస్టు కెప్టెన్సీ, ఆస్ట్రేలియా సిరీస్‌తో వన్డే పగ్గాలు చేపట్టిన శుభ్‌మన్ గిల్ టీ20ల్లో మాత్రం తేలిపోతున్నాడు. వరల్డ్ కప్ సన్నద్ధతలో ఒకటైన దక్షిణాఫ్రికాపై మూడు మ్యాచుల్లోనూ (4, 0, 28 పరుగులు) గిల్ దారుణంగా విఫలమయ్యాడు. సంజూ శాంసన్‌ను బెంచ్ మీద కూర్చోబెట్టి.. వరుసగా అవకాశాల్చినా సద్వినియోగం చేసుకోలేదు. దాంతో చివరి రెండు మ్యాచ్‌లకు గిల్‌ను తప్పిస్తారనే వార్తలు వినిపించాయి. అయితే.. పాదం గాయంతో గిల్ చివరి రెండుమ్యాచ్‌లకు దూరమయ్యాడు. వరల్డ్‌కప్ సమీపిస్తున్నందున అతడి బదులు మరొకరిని తీసుకోవడం మంచిదని మాజీలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇషాన్ కిషన్ తన విధ్వంసక ఆటతో సెలెక్టర్లకు సవాల్ విసురుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో వీర కొట్టుడు కొట్టిన ఇషాన్.. గురువారం ఫైనల్లో రెచ్చిపోయి 45 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. టీ20 ఫార్మాట్లో జరిగిన ఈ టోర్నీలో 517 రన్స్ బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్ నేను అసలైన టీ20 క్రికెటర్ అని చాటుకున్నాడు. గిల్ విఫలమైతున్న వేళ.. ప్రపంచకప్ కోసం నా పేరును కూడా పరిశీలించాలని సెలెక్టర్లకు చెప్పకనే చెప్పాడీ కుర్ర హిట్టర్.

పాండ్యా.. తిలక్‌పరుగుల సునామీ

సౌతాఫ్రికాపై ఇండియా విజయం

టీ20 ప్రపంచ కప్ నుంచి భారత జట్టు దూసుకెళ్తోంది. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ పట్టేసిన టీమిండియా ఈసారి 30 పరుగులతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. శుక్రవారం అహ్మదాబాద్‌లో హార్దిక్ పాండ్యా(63), తిలక్ వర్మ(73)లు మెరుపు హాఫ్ సెంచరీలతో భారీ స్కోర్ అందించగా.. బంతితో వరుణ్ చక్రవర్తి(453), బుమ్రా(217)లు రెచ్చిపోయారు. అంతే.. ఒత్తిడికి లోనైన సఫారీ టీమ్ ఓటమిపాలైంది. టెస్ట్ సిరీస్ కోల్పోయినా వన్డే, పొట్టి ట్రోఫీలు హస్తగతం చేసుకొని ఫ్యాన్స్‌ను ఖుషీ చేసింది భారత్. పొట్టి సిరీస్‌లో ప్రత్యర్థి ఎవరైనా విజయం మాదే అన్నట్టుగా భారత్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే వరుసగా 6 ట్రోఫీలు గెలుచుకున్న టీమిండియా స్వదేశంలో దక్షిణాఫ్రికాను ఓడించి సిరీస్ పట్టేసింది. టీమిండియా నిర్దేశించిన 232 పరుగుల భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్(65) సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తించాడు. దాంతో.. స్కోర్ బోర్డు పరుగులు తీసింది. డికాక్ విధ్వంసంతో పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 67 రన్స్ చేసింది. తర్వాత బంతి అందుకున్న వరుణ్ చక్రవర్తి మొదటి ఓవర్లోనే రీజా హెండ్రిక్స్(13)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. డెవాల్డ్ బ్రెవిస్(31) జతగా దంచేస్తున్న డికాక్‌ను బుమ్రా రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. 13వ ఓవర్లో చక్రవర్తి వరుస బంతుల్లో ఎడెన్ మర్క్‌రమ్(6)ను ఎల్బీగా.. డొనొవాన్ ఫెరీరా(0)ను బౌల్డ్ చేసి మ్యాచ్‌ను టీమిండియావైపు తిప్పాడు. ఆ తర్వాత పాండ్యా ఓవర్లో 6, 4 బాదిన డేవిడ్ మిల్లర్(18)ను అర్ష్‌దీప్ బోల్తా కొట్టించాడు. చివరి ఓవర్లో లిండే(16)ను ఔట్ చేసి సఫారీలను ఒత్తిడిలో పడేశాడు. కానీ, మార్కో యాన్సన్(14) వరుసగా రెండు సిక్సర్లతో స్కోర్ 170 దాటింది. బుమ్రా ఓవర్లో రివ్యూతో యాన్సెన్ వెనుదిరగగా పర్యాటక జట్టు ఓటమి ఖాయమైంది. టీ20 వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌తో పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్యా(63: 25 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అహ్మదాబాద్‌లో చితక్కొట్టాడు. తన పవర్ హిట్టింగ్‌తో దక్షిణాఫ్రికా బౌలర్లను బెంబేలెత్తించిన పాండ్యా జట్టుకు భారీ స్కోర్ అందించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు సంజూ శాంసన్(37), అభిషేక్ శర్మ(34)లు శుభారంభమివ్వగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(5) ఎప్పటిలానే విఫలమయ్యాడు. సూర్య ఔటయ్యే సరికి స్కోర్ 1153. ఆ దశలో క్రీజులోకి వచ్చిన పాండ్యా ఆలస్యం చేయకుండా ఉతుకుడే పనిగా పెట్టుకున్నాడు. లిండే, కార్బిన్ బాష్ ఓవర్లలో బౌండరీలతో రెచ్చిపోయిన అందుకున్నాడు.

మూడో రోజు.. ఆసీస్ ఆధిక్యం

అడిలైడ్ వేదికగా యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాఇంగ్లండ్ మూడో టెస్టులో తలపడుతున్నాయి. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 66 ఓవర్లకు నాలుగు వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌తో కలిపి ఆసీస్ 356 పరుగుల భారీ ఆధిక్యాన్ని ఇంగ్లండ్‌పై ప్రదర్శిస్తుంది. ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్(142*) అద్భుత సెంచరీ చేసి అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో అలెక్స్ కెరీ(52*)హాఫ్ సెంచరీతో సూపర్ నాక్ ఆడుతున్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వీరిద్దరూ ఐదో వికెట్‌ను అజేయంగా 122 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తొలుత 213/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ 286 పరుగులకు ఆలౌటైంది. బెన్‌స్టోక్స్ (83), జోఫ్రా ఆర్చర్ (51) హాఫ్ సెంచరీలు సాధించారు. ఆసీస్ బౌలర్లలో పాట్ కమిన్స్, స్కాట్ బోల్యాండ్ చెరో మూడు, నాథన్ లైయన్ 2, కామెరూన్ గ్రీన్, మిచెల్ స్టార్క్ తలో వికెట్ తీసుకున్నారు. ఆస్ట్రేలియా బ్యాటర్లలో జేక్ వెదర్లాడ్ (1), లబుషేన్ (13), కామెరూన్ గ్రీన్ (7) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఉస్మాన్ ఖవాజా (40; 51 బంతుల్లో, 4 ఫోర్లు) రాణించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన గ్రీన్, రెండో ఇన్నింగ్స్‌లోనూ తక్కువ స్కోరుకే పరిమితమయ్యాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, బ్రైడర్ కార్స్, విల్ జాక్స్ తలో వికెట్ తీసుకున్నారు.

సంక్రాంతికి వినోదాల మెగా విందు

మెగాస్టార్ నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎలాంటి పాత్రనైనా తనదైన అభినయంతో రక్తికట్టిస్తారు. కామెడీని పండించడంలోనూ ఆయన దిట్ట. అయితే గత కొంతకాలంగా మాస్, యాక్షన్ కథలకు ప్రాధాన్యతనిస్తున్న ఆయన వినోదానికి దూరమయ్యారని అభిమానుల్లో కొంచెం అసంతృప్తి ఉంది. ఇప్పుడాలోటుని తీర్చడానికి 'మన శంకరవరప్రసాద్‌గారు'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఈ సినిమాలో ఆయన తనదైన వింటేజ్ కామెడీతో అభిమానుల్లో జోష్ నింపబోతున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. చిరంజీవి స్వాగ్, దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన మార్క్ కామెడీ కలబోతగా ఈ సినిమా సంక్రాంతి బరిలో వినోదాల విందు చేయనున్నదని మేకర్స్ చెబుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఈ సినిమా కోసం చిరు మేకోవర్ చూసి అభిమానులు ఖుషీగా ఉన్నారు. యంగ్ లుక్‌తో సరికొత్త ఛరిష్మాతో చిరంజీవి కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన స్టిల్స్‌ని విడుదల చేశారు. ఇందులో తనదైన మ్యాజికల్ ప్రజెన్స్‌తో ఆకట్టుకుంటున్నారు. అగ్ర హీరో వెంకటేష్ అతిథి పాత్ర ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచనదర్శకత్వం: అనిల్ రావిపూడి.

'లక్కీ భాస్కర్' సీక్వెల్‌చర్చలు!

మలయాళ ఇండస్ట్రీతో పాటు తమిళ, తెలుగు భాషల్లోనూ ప్రామిసింగ్ హీరోగా పేరు తెచ్చుకున్న మలయాళ యంగ్ స్టర్ దుల్కర్ సల్మాన్. మలయాళం కంటె తెలుగులోనే ఎక్కువగా పేరు తెచ్చుకున్న దుల్కర్ వరుసగా తెలుగు సినిమాల్లో నటిస్తున్నాడు. 'మహానటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన దుల్కర్ 'లక్కీ భాస్కర్' మూవీతో మర్చిపోలేని బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నాడు. 2024 అక్టోబర్ 31న విడుదలైన ఈ మూవీ మాసీవ్ బ్లాక్ బస్టర్ అనిపించుకుంది. మూవీ వెంకీ అట్లూరి డైరెక్ట్ చేయగా ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. పాన్ ఇండియా మూవీగా ఐదు భాషల్లో ఏకంగా వంద కోట్లకు మించి వసూళ్లని రాబట్టి దుల్కర్ కెరీర్‌లోనే వన్ ఆఫ్ ది మెమరబుల్ ఫిల్మ్‌గా నిలిచిపోయింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయిన తెలుగు చిత్రాల్లో టాప్‌లో ట్రెండింగ్ అయింది. ఇప్పుడు ఈ మూవీకి త్వరలో సీక్వెల్ ని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఈ మూవీ రిలీజ్ టైమ్‌లోనే సీక్వెల్ టాక్ వినిపించింది. అయితే దర్శకుడు వెంకీ అట్లూరి, దుల్కర్ కమిట్ అయిని ప్రాజెక్టులు పూర్తయ్యాకే దీన్న తెరపైకి తీసుకెళ్లాలని ప్లాన్ చేశారు. ప్రస్తుతం దర్శకుడు వెంకీ అట్లూరి హీరో సూర్యతో ఓ భారీ పాన్ ఇండియా మూవీకి శ్రీకారం చుట్టాడు. దీనికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. మరోపక్క దుల్కర్ సల్మాన్ కూడా వరుసగా సినిమాలు చేస్తున్నాడు. పవన్ సాధినేనితో 'ఆకాశంలో ఒకతార', అయామ్ గేమ్ వంటి సినిమాలు చేస్తున్నాడు. వీటితో పాటు తన 41వ ప్రాజెక్ట్‌గా 'లక్కీ భాస్కర్ 2' చేయబోతున్నాడు. రీసెంట్ గా ఈ సీక్వెల్‌కు సంబంధించిన చర్చల్లో దుల్కర్, వెంకీ అట్లూరి మధ్య జరిగాయని, చర్చలు పాజిటివ్‌గా సాగడంతో స్టోరీని లాక్ చేసి 2026 సెకండ్ హాఫ్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్లాలని ప్లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం సూర్యతో వెంకీ అట్లూరి ఓ మూవీ చేస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీని వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారట.

భర్త మహాశయులకు విజ్ఞప్తి టీజర్

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కు పేరున్న దర్శకుడు కిశోర్ తిరుమల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సినిమా మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్ పై గట్టి ఫోకస్ పెట్టినట్లు ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ చెబుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్, పాటలు రిలీజ్ అయి పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేయగా, ఇది సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది.

ఆలోచింపజేసే 'దండోరా' ట్రైలర్

శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు ముఖ్య పాత్రలు పోషించిన సందేశాత్మక చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకుడు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మాత. ఈ నెల 25న సినిమా విడుదల కానున్నది. మైత్రీమూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నైజాంలో విడుదల చేస్తున్నది. ఓవర్సీస్‌లో 200 థియేటర్లకు పైగా సినిమాను విడుదల చేస్తున్నామని, అలాగే.. అక్కడ ఈ నెల 23న ప్రీమియర్స్ కూడా పడనున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ట్రైలర్‌ని గమనిస్తే.. ఊరి బయట కొందరు శవాన్ని మోసుకెళ్తున్నారు. ఇంతదూరం శవాన్ని ఎందుకు మోసుకురావాలి? అని వారితో ఓ పిల్లాడు అడుగుతాడు. 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసింద్రా ఆ దేవుడు..' అని ఓ మోసేవారిలో ఓ వ్యక్తి ఇచ్చే సమాధానం ఆలోచింపజేసేలా ఉంది. గ్రామీణ తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా సినిమా తెరకెక్కిందని ట్రైలర్ చెబుతున్నది. ఈ సినిమాకు సంగీతం: మార్క్ కె.రాబిన్.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200